Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.04.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 46 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## రెండు నెలల్లోనే...

# ట్రెండ్ మారింది



- ఏపిలో పెనుమార్పులు
- అన్ని జిల్లాల్లోనూ జగన్‌కు జనాదరణ
- వైకాపా వైపు చూస్తున్న నేతలు
- టీడీపీలో సడలుతున్న ధీమా

రాజకీయాలలో పరిస్థితులు తారుమారు కావడానికి ఎంతో కాలం పట్టదు. నాలుగేళ్ళ పదినెలలు సమర్ధవంతంగా పని చేసిన ఒక ప్రభుత్వం ఒక చిన్న తప్పు చేస్తే ఒక్క నెలలోనే గబ్బు పట్టొచ్చు. దాని మూలంగానే ఎన్నికల్లో ఓడిపోవచ్చు. నాలుగేళ్ళ పది నెలల పాటు సమర్ధవంతంగా పనిచేయని ప్రతిపక్షం ఒక్క నెలలో పుంజుకుని అధికారంలోకి రావొచ్చు. రాజకీయాలలో ఏదైనా సాధ్యమే!

ఇలాంటి ట్రెండే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో (మిగతా 11వ పేజీలో)

## ఆంధ్రా కమలపతి ఎవరు?




2లో




## వివేకన్నా...

# నీ రాక కోసం.. నిలువెల్ల కనులై...



సింహపురి సోగ్గాడా... స్టైల్ ఆఫ్ సింహపురీ... ఓ వివేకా... ఎన్నిరోజులైందయ్యా నిన్ను చూసి... నిన్ను చూడక, చిరునవ్వుల లొలికే నీ ఫేసు చూడక మా వాళ్ళ ముఖం వాచిపోయిందనుకో... నాలుగేళ్ళు మున్సిపల్ ఛైర్మెన్‌గా, పదిహేనేళ్ళు ఎమ్మెల్యేగా వుంటే ఏరోజూ నెల్లూరొదిలి పోయినోడివి కాదు... ఒకవేళ పోయినా పక్కరోజు తెల్లారు జామికల్లా వచ్చి సండే మార్కెట్ టీకొట్టు కాడ కనిపించే వాడివి. ఏ రోజు ఏ డ్రస్ వేస్తావో, ఏ రోజు ఏ వేషం కడతావోనని నెల్లూరు జనమంతా నీ కోసం ఎదురుచూసే వాళ్ళు కదా...

నెల్లూరులో నువ్వుంటే ఎంత సందడి... ఏసి సెంటర్ ఎంత కళగా వుండేది. అక్కడ ఎంత బిజినెస్సు... నీ పుణ్యాన అక్కడ సోడాబండోడు, వేరుశెనక్కాయల బండోడు, మజ్జిగ బండోడు... ఇలా ఎంతమంది బ్రతుకుతుండిరి... ఆ సెంటర్‌లో నువ్వు లేకపోయేసరికి పాపం వాళ్ళ బిజినెస్సులన్నీ పడిపోయే... నీ స్టేట్‌మెంట్ లేకుండా పేపర్, నీ విజువల్ లేకుండా ఏసిఎన్‌లో న్యూస్ ఎప్పుడన్నా వచ్చాయా అబ్బయ్యా... నువ్వు ప్రెస్‌మీట్ పెడితే అదే పెద్ద కామెడీ షోగా వుండేది. ఆ ప్రెస్‌మీట్లలో నీ హావభావాలు చూస్తే మనసుకు ఎంత ఉల్లాసంగా వుండేది. మీటింగుల్లో నీ వ్యంగోక్తులు, ప్రత్యర్థులపై నువ్వు విసిరే విమర్శలు ఎంత నవ్వు తెప్పించేవి. ప్రత్యర్థులను కిండల్ చేయడంలో నువ్వు పెద్ద ముదురువు కదా!

ప్రతి ఏటా టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసే పిల్లకాయలకు శుభాకాంక్షలు చెబుతూ గ్రీటింగ్ కార్డులు పంపే వాడివి. వాటిని అందుకుని పిల్లకాయలు ఎంత ఆనందపడే వాళ్ళో... ఆ ఆనందంతోనే పరీక్షలు రాసేవాళ్ళనుకో... కాని మూడేళ్ళ నుండి వాళ్ళను మర్చిపోయావా ఏంటి. గ్రీటింగ్ కార్డులు కూడా పంపడం లేదు వివేకా... వాళ్ళ దృష్టిలో నువ్వు నెల్లూరు నెహ్రూవు. మా చాచా ఎప్పుడు నెల్లూరొస్తాడా... మమ్మల్ని చిరునవ్వుతో ఎప్పుడు పలుకరిస్తాడా అని వారంతా ఎదురుచూస్తున్నారబ్బా! సంతపేటలో దోశెల బండి కాడ నువ్వు దోశెలు పోస్తుంటే చూసి ఎంతకాలమైందో... ఆ దోశల పెద్దామె కూడా మా వివేకా ఎక్కడికిపోయాడు నాయనా, కనిపిస్తే ఒక్కసారి వచ్చి తన చేతి దోశలు, బోండాలు తనిపొమ్మని చెప్పండని టిఫిన్ కోసం వచ్చే వాళ్ళకు చెబుతుందంట... నెల్లూరు రిక్షావాళ్ళు, ఆటోవాలాలు, తోపుడు బండ్లోళ్ళు, మెకానిక్‌లు, కార్పెంటర్‌లు, తాపీ పనోళ్ళు, చెత్త ఎత్తేవాళ్ళు... అందరూ నీ ఫ్రెండ్సే కదా! మా ఫ్రెండ్ ఎక్కడకు పోయాడయ్యా... ఆయనను చూసి ఎన్ని రోజులైందయ్యా అని వాళ్ళు నీ కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా నీ ఫ్యాన్స్ హిజ్రాలైతే దిగులు పెట్టుకుని వున్నారు. వాళ్ళను మనుషులుగా చూసింది నువ్వే కదా... వారితో ఆడి పాడింది నువ్వే కదా నాయనా... ఈమధ్య నెల్లూరులో వ్యాపార దుకాణాల ప్రారంభోత్సవాలకు భారీగా ఖర్చవుతుందంట... ఎందుకురా అని ఆరాతీస్తే, ఓపెనింగ్‌లకు సినిమా యాక్టర్‌లను తీసుకురావాల్సి వస్తుంది, వాళ్ళు వచ్చారంటే 5 నుండి 10లక్షల దాకా ఇచ్చుకోవాలి... అదే నెల్లూరులో మా వివేకన్న ఉండుంటే మాకింత ఖర్చెందుకవ్వుద్ది... ఆయనొక్కడే వందమంది హీరోలతో సమానం... ఆయనను పిలిచి లక్షలు ఇవ్వబల్లేదు... లక్షణంగా ఒక కేకు, సమోసా పెడితే తినిపోతాడు. అంతేనా, ఆయనది లక్కీ హ్యాండ్. మంచి మనసుతో ప్రారంభిస్తాడు కాబట్టి వ్యాపారాలు కూడా అలాగే జరిగేవి. ఇప్పుడేమో ఆయన నెల్లూరులో ఉండకపోతుండె.... ప్రారంభోత్సవాల ఖర్చే కాదు, బిజినెస్‌లకు గ్యారంటీ లేకుండా (మిగతా 11వ పేజీలో)

# విపిఆర్ జన్మదినం... నెల్లూరుకే పండుగ దినం

## • తరలివచ్చిన దివ్యాంగులు

**పుట్టినరోజంటే కేకులు కోయడం, పార్టీలు చేసుకోవడం కాదు... మన పుట్టుక మరికొందరికి పండుగ కావాలి. పదిమంది జీవితాలలో వెలుగులు నింపాలి. ఆ దిశగానే తన జన్మదినాన్ని దివ్యాంగుల పాలిట పర్వదినంగా మార్చారు పార్లమెంటు సభ్యులు, దానగుణ సంపన్నులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.**





విపిఆర్ తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19వతేదీన నెల్లూరు, కనుపర్తిపాడు లోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వినూత్న సేవా కార్యక్రమం ఏర్పాటు చేసారు. శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి, హైదరాబాద్ వారి సౌజన్యంతో దివ్యాంగులకు జైపూర్ ఫుట్స్(కృత్రిమ కాళ్ళు) అమర్చే ఒక గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. 19వ తేదీ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగులు పెద్దఎత్తున తరలివచ్చారు. వచ్చిన దివ్యాంగులందరినీ విపిఆర్ స్వయంగా పలుకరించి, వారిని అతిథులుగా గౌరవించి వారికి జైపూర్ ఫుట్స్ అమర్చి పంపారు.

19వ తేదీ విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతితోపాటు శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివ ప్రభాత్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, బిజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, వైసిపి నాయకుడు నేదురుమల్లి పద్మ నాభరెడ్డి, యల్లసిరి గోపాలరెడ్డి, మేరిగ మురళి, పి.రూప్‌కుమార్‌యాదవ్, శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి ఉపాధ్యక్షురాలు షేక్ ఫరీదా హుస్సేన్ తదితరులు అతిథులుగా హాజరై విపిఆర్ సేవలను కొనియాడారు.

మొదటి రోజే దాదాపు 100మందికి జైపూర్‌ఫుట్స్‌ను అమర్చారు. దివ్యాంగులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో వారి సౌకర్యార్థం రెండురోజులే అనుకున్న క్యాంపును నాలుగు రోజుల పాటు నిర్వహించి మొత్తం 400 మందికి జైపూర్ ఫుట్స్‌ను అమర్చనున్నారు.



### విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసిన విపిఆర్

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బర్త్‌డే వేడుకల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన సతీమణి శ్రీమతి ప్రశాంతితో కలిసి ఆప్తులు, ఆత్మీయులు, తనకు ఎంతో ఇష్టమైన చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. తన చేతులతో పిల్లలకు కేక్ తినిపించి, స్వీట్‌బాక్సులు పంపిణీ చేశారు.



వేమిరెడ్డి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొర్రెపాటి రామకోటారెడ్డి



జైపూర్ ఫుట్స్‌ను అమర్చాక దివ్యాంగులతో కలిసి అడుగులు వేస్తున్న విపిఆర్

# ఆంధ్రా కమలపతి ఎవరు?

***అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాలలోనే తమ పార్టీ జెండాను పాతిన బీజేపీ అంతో ఇంతో అనువుగా వుండే ఆంధ్రప్రదేశ్‌ను వదిలిపెడుతుందా? ఈ రాష్ట్రంలో పాతుకుపోవడానికి ప్రయత్నించకుండా వుంటుందా? ఎట్టి పరిస్థితుల్లోనూ ఆంధ్రాను వదిలిపెట్టదు. ఇప్పుడు కాకపోతే రేపు... ఏపిలో పట్టు సాధిస్తామనే ధీమా ఆ పార్టీలో వుంది. రేపు పట్టు సాధించాలంటే ఈరోజే అడుగు వేయడం మొదలుపెట్టాలి.***

ఆ దిశగానే బీజేపీ ప్రయత్నాలు మొదలయ్యాయి. రెండు ప్రాంతీయ పార్టీలు బలంగా వుండే రాష్ట్రంలో ఒక జాతీయ పార్టీ బలం పెంచుకోవాలంటే సాధ్యమయ్యే విషయం కాదు. రెండు ప్రాంతీయపార్టీలలో ఒక పార్టీని తెరమరుగు చేస్తేనే ఆ స్థానంలో జాతీయపార్టీ రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ప్రణాళికనే బీజేపీ ఏపిలోనూ అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పొమ్మనకుండానే టీడీపీకి పొగబెట్టి ఎన్డీఏ నుండి ఆ పార్టీని బయటకు నెట్టింది. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే ఆశ బీజేపీకి లేదు, కాకపోతే తెలుగుదేశం ఓడిపోవాలనేది వాళ్ళ టార్గెట్! వైసిపి అధికారంలోకి వస్తే జగన్ రాష్ట్ర రాజకీయాలకు మాత్రమే పరిమితం అవుతాడు. అదే చంద్రబాబు మళ్ళీ గెలిస్తే జాతీయ రాజకీయాలలో కూడా బీజేపీకి పుండు అవుతాడు.

### టిడిపి ఓడిపోవాలన్నదే లక్ష్యం

రాష్ట్రంలో బీజేపీ బలపడాలి, టీడీపీ బలహీనపడాలి. ఇందుకోసం మొదట తీసుకున్న నిర్ణయం చంద్రబాబుకు అభి మానపాత్రుడిగా వున్న తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబును అధ్యక్ష పదవి నుండి తప్పించడం... ఆ పనైపోయింది. ఇప్పుడు కొత్త అధ్యక్షుడిగా కాపు సామాజికవర్గానికి చెందిన వాళ్ళను పెట్టడం. ఇందులో భాగంగానే సోము వీర్రాజు, కన్నా లక్ష్మీనారాయణ, పైడి కొండల మాణిక్యాలరావుల పేర్లు తెరమీద కొచ్చాయి. అలాగే ఎన్టీఆర్ కుటుంబానికి చెందిన మాజీ కేంద్రమంత్రి దగ్గుపాటి పురంధేశ్వరి పేరు కూడా ప్రధానంగా రేస్‌లో వున్నట్లు తెలుస్తోంది. టీడీపీని నిర్వీర్యం చేసి తాము బలపడాలనేది బీజేపీ అనుసరించనున్న వ్యూహం! ఇం దుకు ఎన్టీఆర్ కుటుంబాన్ని వాడుకుం టుందో? లేదా కాపు సామాజికవర్గాన్ని మార్గంగా ఎంచుకుంటుందో త్వరలోనే తేలబోతోంది!

# హోదా కోసం భారీ ప్రదర్శన



ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అంటూ నినదిస్తూ... మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన నెల్లూరులో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) ఆధ్వర్యంలో వందలాదిమంది యువకులు మట్టి, నీళ్ళ కుండలతో విఆర్‌సి సెంటర్ నుండి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదాతోనే యువతకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ప్రత్యేకహోదా సాధించేందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని కోరారు. విభజనతో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా నష్టపోయిందని, కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు అశోక్‌రెడ్డి, లేఖిన్‌రెడ్డి, మహేష్, బాబు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన లోహశాస్త్ర పరిజ్ఞానాన్ని పరిశోధించాలి

**– డాక్టర్ ఎస్.జైకిషన్**

మనదేశంలో లోహ శాస్త్ర పరిజ్ఞానం ఎంతో ప్రాచీనమైనదని, దానిని మరింత లోతుగా పరిశీలించాలని హైదరాబాద్ లోని భవాన్స్ న్యూసైన్స్ కళాశాల ఛైర్మెన్ డాక్టర్ ఎస్.జైకిషన్ అన్నారు. నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 16న టౌన్‌హాలు ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) సమావేశ మందిరంలో జరిగిన శ్రీ నేలనూతల శ్రీకృష్ణమూర్తి 15వ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మన దేశంలో లోహశాస్త్ర పరిజ్ఞానం క్రీ.పూ 2500కు పూర్వమే అభివృద్ధి చెందిందనీ, ఇలాంటి అపూర్వమైన ప్రాచీన లోహశాస్త్ర పరిజ్ఞానం గురించి ఏ స్థాయి పాఠ్యాంశాల్లో కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. తాను, మిత్రులతో కలిసి స్థాపించిన దక్కన్ పురావస్తు సాంస్కృతిక పరిశోధనా సంస్థ(డిఎసిఆర్ఐ) ద్వారా ఈ రంగంలో ఎన్నో పరిశోధనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వంటేరు వెంకట కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు వేదం వేంకట్రామన్, పొన్నాల రామసుబ్బారెడ్డి డాక్టర్ జైకిషన్‌ను సత్కరించారు. మోపూరు వేణుగోపాలయ్య, డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి, వల్లకవి వెంకట సుబ్బారావు, డా.కాళిదాసు పురుషోత్తం, విఆర్‌సి ఫిజిక్స్ రీడర్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, ఎన్.సుందర్‌బాబు పాల్గొన్నారు.



# ‘ఆనం’ సరే.. మరి ఆదాల...?



## • ఆనంతో పాటు ఆదాల కూడా రావాలని వైసిపి శ్రేణుల ఆకాంక్ష

**ఇది నిజంగా ఆశ్చర్యం గొలిపే పరిణామం. నెల్లూరుజిల్లాలో “ఆనం” రాజకీయ ప్రస్థానంలో ఇదో అనూహ్య మజిలీ. తెలుగుదేశం ఆ తరువాత కాంగ్రెస్ మళ్ళీ తెలుగుదేశం ప్రస్తుతం వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ.**

*జిల్లాలో ‘ఆనం’ అంటే బలమైన పేరుంది. ఆనం వర్గం అంటూ వారికి ప్రతిచోటా ఓ బృందం ఉంది. ముఖ్యంగా నెల్లూరు నగరాన్ని తన హస్తగతం చేసుకుని పాలించిన ఘనత ఆనం వివేకానందరెడ్డిది. అన్న నగర రాజకీయాలతో కథ నడుపుతుంటే తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర స్థాయిలో తమ ఉనికిని చాటుకుంటూ అటు తెలుగుదేశంలోనూ ఇటు కాంగ్రెస్‌లోనూ మంత్రిగా కూడా ఆనం హవా కొనసాగించాడు.*

ముఖ్యంగా వై.యస్.రాజశేఖరరెడ్డి ఐదేళ్ళ పాలనలో ఆనం కుటుంబ రూపురేఖలే మారిపోయాయి. నెల్లూరుజిల్లాలో నేదురుమల్లి హవా తగ్గించే ప్రక్రియలో భాగంగా ఆనం వారిని వై.యస్. నెత్తినెక్కించుకున్నాడు. వారికి అగ్రతాంబూలం ఇచ్చి జిల్లా రాజకీయాలలోనే కాకుండా రాష్ట్ర రాజకీయాలలో కూడా ఆనం వారికి అనూహ్య గుర్తింపు లభించేలా చేశాడు. ఒక దశలో రామనారాయణరెడ్డి మంత్రివర్గంలో అత్యంత కీలకంగా వ్యవహరించే స్థాయిలో వారికి ప్రాధాన్యత కల్పించాడు.

### వై.యస్. మరణానంతరం ఆయన చేసిన సహాయాన్ని వీళ్ళు మర్చిపోయారు

2009 సెప్టెంబర్ 2న వై.యస్.రాజశేఖరరెడ్డి దుర్మరణం పాలవడం అనంతరం జరిగిన అనేక రాజకీయ పరిణామాలతో ఆనం సోదరులు వై.యస్. వారసుడు జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా అడుగు వేయడం అప్పట్లోనే కాదు, ఇప్పటికి కూడా పెద్ద చర్చనీయాంశమే. జగన్‌ను వ్యతిరేకించినా, కాంగ్రెస్‌లోనే కొనసాగి వుండినా పెద్ద తప్పై వుండేది కాదు. తెలుగుదేశంలో చేరి చంద్రబాబుకు జైకొట్టి అటు విజయమ్మని తమ్ముడు, జగన్‌ని అన్న తీవ్రస్థాయి పదజాలంతో విమర్శించడం దూషించడం “ఆనం” అభిమానులకే మింగుడు పడలేదు. ఆనంకి అగ్రస్థానమిచ్చి చేరదీసి ఆదరించిన వై.యస్ సతీమణిని ఆయన కుమారుడిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం చాలా మందికి నచ్చలేదు. రాజకీయంగా విశేష అనుభవం, చాణుక్యత కలిగిన ఆనం సోదరులు ఈ విధంగా ప్రవర్తించడం ఎవ్వరికీ ఇష్టం లేదు.

### రావద్దన్నా వచ్చిన ముఖ్యమంత్రి

### మొహం చాటేసిన ఆనం కుటుంబసభ్యులు

తమనేదో పొడిచేస్తాడని చంద్రబాబు పంచన చేరిన వారికి చేదు అనుభవాలే మిగిలాయి. తన సహజ ప్రవర్తనతో బాబు వీరికి మొండిచేయి చూపించాడు. ఆనం వివేకానందరెడ్డి గత రెండు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే కనీసం చూడడానికి కూడా చంద్రబాబుకు మనసు రాలేదు. వివేకా పరిస్థితి రోజురోజుకీ విషమిస్తుందని తెలిసి గత గురువారం ఆయన స్టార్ ఆసుపత్రిలో వివేకాను పలకరించడానికి వెళ్తే పాపం వివేకా ముఖ్యమంత్రిని గుర్తుపట్టే స్థితిలో కూడా లేడని సమాచారం. ముఖ్యమంత్రిని రావద్దని ఆనం కుటుంబీకులు చెప్పినా వినకుండా ఆసుపత్రికి వెళ్ళిన బాబుకి ఆనం కుటుంబ సభ్యులందరూ ముఖం చాటేసి నిరసన తెలిపారు.

### ఆనం ఆగమనంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు

ఈ క్రమంలో ఆనం రామనారాయణరెడ్డి త్వరలో వై.యస్.ఆర్ కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న వార్త ఒక్కసారిగా రాష్ట్రమంతా గుప్పుమంది. ఆయన ఆత్మకూరు లేదా వెంకటగిరి నుండి పోటీ చేస్తారని కూడా ప్రచారంలోకి వచ్చింది. దీనికి తగ్గట్లుగా రామనారాయణరెడ్డి బాహాటంగానే తెలుగుదేశాన్ని, పార్టీ అధ్యక్షుడిని విమర్శించడంతో వైసిపి ప్రవేశం ఖాయం అనే నిర్ణయానికి ఆనం అభిమానులు వచ్చేశారు. ఆయన ఏ పార్టీలో చేరినా పరవాలేదు ముందు తెలుగుదేశం నుండి బయటకు వస్తే చాలనుకుంటున్న ఆయన అభిమానులు, వై.యస్.ఆర్. కాంగ్రెస్‌లో చేరితే బాగుంటుందనుకుంటుండిన ఆయన అనుయాయులు సంబరాలు కూడా చేసుకున్నారు. అయితే రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని ముఖ్యంగా ఆయన శ్రీమతి విజయమ్మని, కుమారుడు జగన్‌ని అంతటి తీవ్ర విమర్శలు చేసిన వాళ్ళని ఎలా పార్టీలోకి ఆహ్వానిస్తారంటూ వైసిపిలోని ఓ వర్గం వాపోతోంది. రాజకీయాలలో విమర్శలు ప్రతి విమర్శలు, దూషణలు సహజమే కానీ ఆనం సోదరులు ఓ అడుగు ముందుకు వేసి చాలా ఎక్కువ స్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా విజయమ్మను రామనారాయణరెడ్డి కించపరచే విధంగా మాట్లాడితే జగన్‌ని వివేకానందరెడ్డి అసభ్య పదజాలంతో మాట్లాడాడు. వీరికా ఇప్పుడు వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ స్థానం కల్పించేదన్న అసంతృప్తి చాలామందిలో కనిపిస్తోంది. అయితే ఆనం వారికి కొద్దోగొప్పో వర్గం వుంది కాబట్టి, వారి రాక పార్టీకి అదనపు బలమే తప్ప నష్టం మాత్రం కాదన్న వాదన కూడా వినపడుతోంది.

బహుశా తమకి ఇంతటి పరిస్థితి వస్తుందని ఆనం వాళ్ళు కలలో కూడా ఊహించి వుండరేమో..! రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలతో పాటు పార్టీ ఫిరాయింపులు కూడా సహజమే. కాని, జిల్లాలో అతిపెద్ద రాజకీయ కుటుంబమైన “ఆనం” వారికి ఇలాంటి సంకట స్థితి రావడం నిజంగా విధివైపరీత్యమే. ఒకప్పుడు వారి కోర్కెలతో, వారి కండిషన్స్‌తో వాళ్ళు పార్టీలో చేరేవాళ్ళు, కానీ ఇప్పుడు పార్టీ నిబంధనల మేరకే పార్టీలోకి రావడానికి ఆసక్తి చూపుతున్న వారి దీన స్థితి చూస్తుంటే... ఔరా! పాలిటిక్స్ & పాలిట్రిక్స్ అనిపిస్తుంది.

### ఆదాల రాకపై వైసిపి శ్రేణుల ఆసక్తి..!

ఇదే సమయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేరు కూడా వైసిపి వర్గాల్లో తీవ్ర చర్చకు వస్తోంది. ఆదాల అజాతశత్రువు. ఆయన వల్ల ఎదుటివారికి లాభమే తప్ప ఎదుటి వారి దగ్గర నుండి తానేమీ ఆశించడన్న పేరు కూడా

(మిగతా 10వ పేజీలో)


మా ప్రణాళికల ప్రభావం... మా విద్యార్థుల కృషి ఫలితం
మార్కులలోనే కాదు గ్రేడులలో కూడా సునాయాస విజయాలు
మారిన విద్యావిధానమైనా మరపురాని ఫలితాలకు చిరునామా విశ్వసాయి
10 GPA 166 STUDENTS
9.83 GPA 124 STUDENTS
9.67 GPA 111 STUDENTS
2018 JUNIOR INTERMEDIATE RESULTS



JUNIOR INTER GROUP WISE ANALYSIS 2018

| GRADE POINTS | BIPC | MPC | TOTAL |
|---|---|---|---|
| 10/10 | 116 | 50 | 166 |
| 9.83/10 | 84 | 40 | 124 |
| 9.67/10 | 81 | 30 | 111 |
| 9.5/10 | 52 | 19 | 71 |
| 9.33/10 | 48 | 22 | 70 |
| 9.17/10 | 41 | 13 | 54 |
| 9/10 | 33 | 16 | 49 |
| 9 Above | 455 | 190 | 645 |

A/c Campus
COURSES OFFERED
Bi.P.C. Directors Batch
NEET, AIIMS, JIPMER, EAMCET, Etc.
M.P.C. J.O.I (JEE-IIT / NIT)
(JEE Oriented Intensive coaching)
NEET MEDICAL Long-Term Coaching

Dr. N. Satyanarayana & G. Krishna Mohan's
VISWASAI EDUCATIONAL SOCIETY JUNIOR COLLEGE
Annamaiah Circle, NELLORE. Ph : 8886770470, 9703745222, 9160670002, 03
Biragipatteda, TIRUPATI. Ph : 9160670004, 9440375416, 8886667012, 7013

## 'ప్రభా'తం

# 'చితి'కిపోతున్న చిన్నారి!

కశ్మీర్, ఉత్తరప్రదేశ్‌లలో బాలికలపై జరిగిన అత్యాచారాలు, ఆపై హత్యలు దేశాన్ని అట్టుడికించేస్తున్నాయి. ఈ ఘటనలు బిజెపి పాలన వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నాయి. దేశంలో ఎక్కడో ఒకచోట నిత్యం అబలలపై ఇలాంటి అఘాయిత్యాలే జరుగుతూ ఉండడం దేశప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఘటనలు ప్రభుత్వ పాలనా యంత్రాంగానికి సవాల్ విసురుతున్నాయి. అబలలపై అకృత్యాలకు పాల్పడుతున్న మానవమృగాలను కఠినంగా శిక్షిస్తే తప్ప దేశంలో ఈ అఘాయిత్యాలు ఆగవు.

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయిపోతున్నట్లుగా ఉంది మన దేశం పరిస్థితి. ప్రపంచానికే ఆదర్శవంతంగా ఉంటుందనుకున్న దేశం కాస్తా..అరాచక భారత్‌గా తయారవుతోంది. ఇన్నాళ్ళకైనా దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశిస్తే అది కూడా ఆశాభంగమైపోతోంది. చివరికి అడ్డూ అదుపు లేకుండా అరాచకాల దారిలో సాగిపోతోంది. దేశంలో ఎక్కడ చూసినా మానవ మృగాలు సంచరిస్తున్నాయి. ప్రతిరోజూ అరాచకాలు, అకృత్యాలు ప్రబలిపోతూనే ఉన్నాయి. అభం శుభం తెలియని చిన్నారులు, యువతులు, మహిళలపై అత్యాచారాలు, ఆపై హత్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

దేశంలో మహిళలకు, బాలబాలికల రక్షణకు ఎన్నో చట్టాలున్నా, మానవమృగాలు మాత్రం వాటిని కనీసం ఖాతరుచేయకుండా బరితెగింపు ధోరణితో అబలలపై తమ దౌష్ట్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. చట్టాలు కొరడా ఝుళిపించి కఠిన శిక్షలు విధించకుంటే మాత్రం.. దేశంలో అబలల ఆర్త నాదాలు తప్ప ఇక శాంతినాదాలు వినిపించవు. దేశంలో.. ప్రతి రాష్ట్రంలోనూ ఈ అత్యాచారాలు, అకృత్యాలు రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. కనీసం మానవత్వం కూడా లేని నరరూప రాక్షసులు అమాయకులైన చిన్నారులు, మహిళలను తమ అఘాయిత్యాలకు గురి చేస్తూ వికటాట్టహాసాలు చేస్తూనే ఉన్నారు. అయినా, పాలకులు మాత్రం ఎన్నికలని, రాజకీయాలని ఇంకా మరిన్ని పదవుల కోసం అర్రులు చాస్తూనే ఉంటున్నారే తప్ప దేశంలో జరుగుతున్న ఈ అకృత్యాలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా దేశంలో ఎక్కడబట్టినా రోజూ ఏదో ఒకచోట అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇటీవల కశ్మీర్, ఉత్తరప్రదేశ్‌లలో బాలికలపై జరిగిన అత్యాచారాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహోదగ్రులను చేస్తున్నాయి.

జమ్ము కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఎనిమిదేళ్ళ చిన్నారిపై అత్యాచారం జరిగింది. అక్కడి రసానా అనే చిన్న గ్రామంలో గుర్రాలను మేపుకునే ఒక సంచారతెగకు చెందిన బాలికపై మానవమృగాలు సామూహిక అత్యా చారానికి పాల్పడి, ఆ తర్వాత నిర్దాక్షిణ్యంగా చంపివేశాయి. ఆ బాలిక కుటుంబానికి సన్నిహితులైన కొందరు బంధువులే ఈ పైశాచికత్వానికి పాల్పడ్డారట!..ఎంత ఘోరం!...ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్థానిక పోలీసులు లంచం తీసుకుని కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం మరెంతో దారుణం. ఆ బాలికపై జరిగిన అత్యాచార ఘటన ప్రజల్ని కంటతడిపెట్టించింది. కశ్మీర్‌నే కాక దేశవ్యాప్తంగా అది తీవ్ర ప్రకంపనలు పుట్టించింది. అయినా, ప్రధాని మోడీ ఆశించిన స్థాయిలో ఆ ఘటనపై స్పందించకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అదేవిధంగా, లక్నో-కాన్పూర్ మధ్య 'ఉన్నవ్' అనే నగరంలో ఓ అబలపై జరిగిన పాశవిక సంఘటన దేశప్రజల్ని కలచివేస్తోంది. ఉద్యోగం కోసం అక్కడి బిజెపి ఎమ్మెల్యే కుల్‌దీప్‌సింగ్ సెంగార్ నివాసానికి వెళ్తే, తనపై ఎమ్మెల్యే అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ ఒక యువతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసం ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటనలో ఆమెకు న్యాయం జరిగేది తర్వాత సంగతి, ఆ తర్వాత ఆమె తండ్రి అనుమానాస్పద మృతి ఘటనతో బాధితురాలు మరింత తల్లడిల్లిపోయింది. ఈ సంఘటనలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా మరింత సంచలనమైంది. న్యాయం చేయమని మొరపెట్టుకుంటున్నా న్యాయం జరగని ఘోర పరిపాలనలో మనం ఉన్నామన్నమాట!..బాధితులను మరింతగా బాధపెట్టే విధంగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ పాలన నిరంకుశపాలనగా ప్రజల్లో ముద్రవేసుకుంటోంది. దీంతో, మొత్తంగా బిజెపి పాలనపై దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రభావం రానున్న ఎన్నికల్లో ఎలా ఉండబోతుందో రాజనీతిజ్ఞులైన మోడీ, అమిత్‌షా వంటి అనుభవజ్ఞులకు తెలియనిది కాదు. కానీ, వారు కూడా ఇలాంటివాటిని చాలా తేలిగ్గా తీసుకోవడం వల్ల పార్టీకి మరింత నష్టం తప్పదు. మోడీ ఈ దేశాన్ని 'అత్యాచార దేశం'గా మార్చాడంటూ కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నా బిజెపి పాలకులు పట్టించుకోవడం లేదు. కేంద్రంలో తామే మళ్ళీ అధికారంలోకి వస్తామనే ధీమాతో ఎవరికి వారు వ్యూహాలు రచించుకుంటున్నారే తప్ప, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఘోరాలను, నేరాలను, ముఖ్యంగా బాలికల పట్ల, మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలను అణచివేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో బిజెపి పాలనా తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఇలాంటి అఘాయిత్యాలే నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాలనా యంత్రాంగానికి సవాల్ విసురుతున్నాయి. కశ్మీర్‌లో ఒక బాలికపై మానవమృగాలు అత్యాచారం చేసి, హతమార్చిన ఘటనతో దేశం అల్లకల్లోలంగా ఉంటే, తాజాగా మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో ఏడేళ్ళ చిన్నారిపై జరిగిన మరో ఘోరం దేశప్రజలను కలచివేస్తోంది. పెళ్లి పందిరిలోంచి ఓ చిన్నారిని ఎత్తుకెళ్ళిన ఓ దుండగుడు..మద్యం మత్తులో అత్యాచారం చేసి ఆ చిన్నారిని హతమార్చిన ఘటన కలకలం రేకెత్తిస్తోంది. ఈ అత్యాచారాలతో దేశం అట్టుడికినట్లు ఉడుకుతోంది. దేశంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైన సమయంలో ఆ మానవమృగాలను కఠినంగా శిక్షించకుండా ప్రభుత్వాలు మౌనంగా ఉండడం మరింత ఘోరం. ప్రధాని మోడీ ఇలాంటి ఘటనల పట్ల వెంటనే స్పందించకపోవడం దేశప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది.

మనదేశంలో మోడీ రాకతో హీరో పాలన వచ్చిందనుకున్నాం. అబలలు, మహిళలు, చిన్నారులు...ఎందరో ఇలా నరరూపరాక్షసుల అకృత్యాలకు బలైపోతున్నా ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటే ఎలా?..మోడీ వెంటనే మౌనం వీడాలి. ఆ మానవమృగాల అంతుచూడాలి.. అబలలకు రక్షణ కల్పించాలని కోరుకుంటున్నారు జనం. అయినా, పాలకులంటే ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవాలేగానీ.. ఏమి జరుగుతున్నా పట్టించుకోకుంటే అది హీరో పాలన కాదు.. 'నీరో' పాలనే అవుతుంది. ఇకనైనా కేంద్రప్రభుత్వం రంగంలోకి దిగాలి!.. దేశంలో ఇలాంటి అకృత్యాలకు, అత్యాచారాలకు వెంటనే చరమగీతం పాడాలి!..

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

# రాజ్యాంగ నిర్మాత జయంతి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షులు డా. పనబాక కృష్ణయ్య సారధ్యంలో ఈ నెల14న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల్లూరు ఇందిరాభవన్ వద్ద, అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో దళితులు, గిరిజనులు, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి డా. అంబేద్కర్ జయంతిని వేడుకగా నిర్వహించారు. డా.అంబేద్కర్ ఒక గొప్ప సంఘసంస్కర్త అని, అన్నివర్గాల వారికి ఆదర్శప్రాయుడన్నారు. డా.అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అందరం ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను కాలరాస్తూ దళిత వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సివి శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, షేక్ జహంగీర్, ఉడతా వెంకట్రావ్, సునీల్‌రాజు, ఆర్‌వి రమణయ్య, బాలసుధాకర్, రఘురాం ముదిరాజ్, షేక్ ఫయాజ్, షేక్ ఆసిఫ్‌బాషా, శివప్రసాద్, షేక్ ఇబ్రహీం, అనురాధారెడ్డి, మంజుల, అరవ రామ్మోహన్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత ర్యాలీగా వెళ్ళి విఆర్‌సి సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అంబేద్కర్ ఆశయాల బాటలో నడుద్దాం



మాట్లాడుతున్న ఏ.సి నాగేశ్వరరావు

డా. బిఆర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాల బాటలో అందరం నడవాలని వక్తలు పేర్కొన్నారు. ఈనెల14న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రక్షణ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హరనాథపురంలోని ఎస్‌విఎన్ హైస్కూల్‌లో డా.బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ ఏ.సి నాగేశ్వరరావు మాట్లాడుతూ, హిస్టరీ, ఎకనమిక్స్, పాలిటిక్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఫిలాసఫీ, న్యాయశాస్త్రం వంటి 7 శాస్త్రాల్లో డిగ్రీలు పొందిన అంబేద్కర్ 7 భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని, ఆయన విశేష ప్రజ్ఞావంతుడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూలు కరెస్పాండెంట్ పివి రెడ్డి, ఎం.సతీష్‌కుమార్, గుర్రంకొండ సర్దార్ పాల్గొన్నారు.




# ఉరి తీయాలి

జమ్మూలో 8ఏళ్ళ అభంశుభం తెలియని చిన్నారి ఆసిఫాను అత్యంత కిరాతకంగా రేప్‌చేసి చంపిన నిందితులను వెంటనే ఉరితీయాలి. ఇలాంటి కామాంధుల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ మానవత్వం చూపరాదు. రేపిస్టులను సమర్ధించే వారిని, రక్షించాలనుకునే వాళ్ళను కూడా శిక్షించాలి. ఇలాంటి అత్యాచారాల సంఘటనలో మైనర్‌నిందితులను వదిలేస్తున్నారు. గతంలో నిర్భయ కేసులోనూ అత్యంత కిరాతకంగా ప్రవర్తించిన మైనర్ నిందితుడు ఎక్కువకాలం శిక్ష లేకుండానే బయటకొచ్చాడు. ఇలాంటి కేసుల నుండి తప్పించుకోకుండా మైనర్ చట్టాన్ని మార్చాలి. అత్యాచారాలను, హత్యలను మతాలు, కులాలతో ముడిపెట్టకుండా చూడాలి. **- గోనుగుంట సుకన్య, నెల్లూరు.**

# హాస్యం ఎలా పుడుతుంది

ఇతర దేశాలలో అభినయాలతో హాస్యం పుట్టిస్తారు. చార్లీచాప్లిన్ నటన ద్వారా హాస్యం సృష్టించాడు. మన దేశంలో కులాల మీద హాస్యం, జంతువుల మీద, పక్షుల మీద, చెట్ల మీద హాస్యం పుట్టిస్తారు. కులాల పిచ్చి ముదరబట్టి ఇటీవల హాస్య సన్నివేశాలను కూడా వివాదాస్పదం చేస్తున్నారు. ఒక్కో కులానికి హాస్యపరంగా ఒక్కో చాటువు వుంది. ఉపన్యాసకులు తమ ప్రసంగాలలో వాటిని ఉటంకించినపుడు విమర్శకులు వాటిని పాజిటివ్‌గా తీసుకోవడం లేదు. ఆయా కులాలను కించపరిచేలా మాట్లాడారంటూ వివాదాలు సృష్టిస్తున్నారు. దీనిపై టీవీలలో చర్చా వేదికలు పెడుతున్నారు. చివరకు ఉపన్యాసకులను మాట్లాడలేని స్థాయికి తెస్తున్నారు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ఇది చేతకాని తనమే!

ఒక ఇంటి పెద్ద తన కుటుంబసభ్యులపై అలిగాడంటే అది అతని వైఫల్యమే! అలాగే ఒక ప్రధాని పార్లమెంట్‌లో జరిగిన సంఘటనలకు నిరసనగా ఒకరోజు నిరాహారదీక్ష చేసాడంటే అది ఖచ్చితంగా అతని వైఫల్యమే! ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ ఒకరోజు నిరాహారదీక్షకు పిలుపునిచ్చాడు. పార్లమెంటులో విపక్షాలు అనుసరించిన వైఖరికి నిరసనగా అంటూ ఆయన దీక్ష చేసాడు. పార్లమెంట్ సజావుగా జరగలేదంటే దానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం. గతంలో ఏ ప్రధాని కూడా ఇలా ప్రతిపక్షాల మీద అలిగి నిరాహారదీక్షలు చేసిన దాఖలాలు లేవు. నరేంద్ర మోడీ ఇలా తన చేతకానితనాన్ని చాటుకున్నాడు. ఒక దేశ ప్రధాని చేయాల్సిన పనికాదు ఇది. అలా చేయాలనుకుని వుంటే ఆహారాన్ని మిగిల్చే దిశగా నిరాహారదీక్ష చేసుంటే బాగుండేది.

**వి.రాజేష్, నెల్లూరు.**

# అమ్మో... దొంగల ముఠా

- తమిళనాడు రాష్ట్రం, చిత్తూరుజిల్లా సరిహద్దుల్లో పార్థివ్ గ్యాంగ్
- అప్రమత్తంగా ఉండాలంటున్న నెల్లూరు పోలీసులు



కరుడుగట్టిన కిరాతకులు వాళ్ళు... మంచితనం, మానవత్వం ఉండదు... దయ, కరుణ మచ్చుకైనా కానరావు... పిల్లా, పెద్ద అనే తేడా లేదు... ఇంట్లో దూరితే అందర్నీ చంపేయడం, అందినకాడికి దోచుకునిపోవడం... దోచుకున్న ఇంట్లోనే భోం చేయడం, అక్కడే మలమూత్రాలు విసర్జించడం... ఈ ముఠా గురించి వింటుంటేనే 'దండుపాళ్యం' సినిమా గుర్తుకువస్తుంది. ఈ ముఠాలను కష్టపడి మన పోలీసులు పట్టుకుంటూనే వుంటారు. కాని, మన చట్టాలు, లాయర్లు బయటకు తీసుకొచ్చి జనం మీదకు వదులుతుంటారు.

వింటేనే ఎంతో భయం కలిగించే ఇలాంటి ముఠా ఒకటి నెల్లూరుజిల్లాలోకి ప్రవేశించే అవకాశం వుందన్న సమాచారంతో జిల్లావాసులు భయాందోళనలకు లోనవుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాత్రి గస్తీలు ముమ్మరం చేసారు. రాత్రివేళ విధులు నిర్వహించే పోలీసులను సులభంగా వాడే ఆయుధాలతో తిరగాలని ఎస్పీ ఆదేశించారు. హైవేపైన, టోల్‌గేట్ల వద్ద, రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, పెట్రోల్ బంకులు, శివారు ప్రాంతాల వద్ద నిఘా పెట్టారు.

## అత్యంత కిరాతకులు పార్థివ్ గ్యాంగ్...

మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌కు చెందిన పార్థివ్ గ్యాంగ్ తమిళనాడు రాష్ట్రం, చిత్తూరుజిల్లా సరిహద్దుల్లో సంచరిస్తుందనే సమాచారం పోలీసులకు అందింది. ఈ గ్యాంగ్‌లో 10నుండి 20మంది వరకు సభ్యులుంటారు. వీళ్లందరూ ఆదివాసీ తెగవారే! నాగరికత తెలియని మూర్ఖులు. దోపిడీయే వీరి వృత్తి. ఈ గ్యాంగ్‌లో మహిళలు చురుకుగా వుంటారు. పగలు వీళ్ళు బజార్లలో ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ, చెత్తకాగితాలు ఏరుకుంటూ రెక్కీ నిర్వహిస్తారు. తాళం వేసిన ఇళ్ళను, లేదా దుకాణాలను గుర్తిస్తారు. రాత్రి స్పాట్ పెడతారు. నగర, పట్టణ శివారు ప్రాంతాలలో విలాసవంతమైన భవనాలు వుంటే వాటికే మొదటి ప్రాధాన్యతనిస్తారు. తమ దోపిడీ క్రమంలో అడ్డొచ్చిన వాళ్ళను అడ్డంగా చంపేస్తారు. అర్ధరాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్ళే వాళ్ళను కూడా వీళ్ళు దోచుకుంటారు. గుళ్ళలోనూ దోపిడీలకు పాల్పడుతుంటారు. ఈ ముఠా కదలికలపై పోలీసులు నిఘాపెట్టారు. ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండడం మంచిది.



ఎన్నికల బరిలో...

# ఎమ్మెల్సీలే దిగక తప్పదా?

## జిల్లాలో 'దేశం'కు అభ్యర్థుల కొరత

**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగా వుండే జిల్లాల్లో నెల్లూరు ఒకటి. ఈ జిల్లాలో వైసిపి టిక్కెట్లకు డిమాండ్ వుంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాలలో సిటింగ్ ఎమ్మెల్యేలున్నారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లున్నారు. కొన్ని నియోజకవర్గాల టిక్కెట్ల కోసం సీనియర్ నాయకులతో పాటు కొత్తగా పార్టీలో చేరుతారనే ప్రచారం వున్న నాయకులు కూడా పోటీ పడే అవకాశం వుంది.**

### భిన్నంగా టీడీపీ పరిస్థితి

వైసిపిలో ఈ పరిస్థితి వుంటే టీడీపీ మాత్రం అందుకు భిన్నంగా వుంది. ఆ పార్టీకి సమర్థులైన అభ్యర్థుల కొరత వుంది. ప్రస్తుతం పార్టీలో వున్న ఇద్దరు ముగ్గురు గట్టి నాయకులు వైసిపిలో చేరుతారనే ప్రచారం వుంది. ఇది జరిగితే అభ్యర్థులను వెదుక్కోవడం వారికి ఇంకా కష్టం కావచ్చు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభకు పోటీ చేసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఈసారి తెలుగుదేశంలోనే వుంటే అసెంబ్లీ సీటును అడగొచ్చు. అప్పుడు లోక్‌సభకు బీద మస్తాన్‌రావును దించాల్సి రావచ్చు. బిఎంఆర్‌ను లోక్‌సభకు పెడితే ఎమ్మెల్సీగా వున్న బీద రవిచంద్రను కావలి నుండి రంగంలోకి దించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అలాగే మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఎన్నికల నాటికి ఎమ్మెల్సీ పదవీ కాలం రెండేళ్ళ దాకా వుంటుంది. అయినా కూడా సర్వేపల్లి బరిలో ఆయననే దించాల్సిన పరిస్థితి. సర్వేపల్లిలో ఆయన అయితే తప్పితే ఇంకెవరూ పోటీలో నిలవలేరు. మరో మంత్రి నారాయణ సైతం ఈసారి ఎన్నికల్లో ఎక్కడో చోట పోటీకి దిగక తప్పేటట్లు లేదు. ఎందుకంటే పార్టీలో గట్టి అభ్యర్థులు వీళ్ళే. ఎన్నికల్లో వీళ్లను పక్కన పెట్టి పార్టీకి నష్టం చేసుకోలేరుగా!

# అనుచర వర్గంలో 'ఆనం'దం

**ఇటీవల జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఆనం అనుచర వర్గానికి ఆనందం కలిగిస్తున్నాయి. తమ ఆలోచనలకు అనుగుణంగా ఆనం సోదరుల అడుగులు పడుతున్నాయని వాళ్ళు ఆశ పడుతున్నారు.**

2015లో ఆనం సోదరులు కాంగ్రెస్‌ను వదిలారు. కాంగ్రెస్‌ను వీడడం వరకు బాగానే వుంది. కాని, వాళ్ళు వెళ్ళి తెలుగుదేశంలో చేరడాన్ని జిల్లాలోని వాళ్ళ అనుచరులు జీర్ణించుకోలేకపోయారు. వాళ్ళు చేరకముందే అనుచరులు చాలావరకు వైసిపిలోకి వెళ్ళిపోయారు. వీళ్ళు తెలుగుదేశంలో చేరాక చాలా కొద్దిమంది మాత్రమే వీళ్ళను అనుసరించారు. జిల్లాలో నెల్లూరు నగరంతో పాటు ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాలలో ఆనం ప్రాబల్యం వుంది. మిగిలిన నియోజకవర్గాలలోనూ ఆనంకు ముఖ్యులున్నారు. అయితే తెలుగుదేశంలో చేరాక వీళ్ళకు చాలామంది దూరం కాసాగారు. అనుచరులెవరికీ ఆ పార్టీ అంటే ఇష్టం లేదు. నెల్లూరు నగరంలో వారి అనుచరవర్గం చాలా వరకు వైకాపాలోకి వెళ్ళిపోయింది. ఆత్మకూరు నియోజకవర్గంలో మాత్రం ఆనం వర్గం కొంత బలంగావుంది. అయితే అక్కడున్న వాళ్ళంతా కూడా వైసిపి అభిమానులే! తెలుగుదేశం అంటే పడదు. రేపు ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేసినా వాళ్ళు గట్టిగా పనిచేసే పరిస్థితి లేదు. వాళ్ళు పనిచేసినా ఓట్లు రావు. రేపు ఆనం తెలుగుదేశాన్ని వీడి వైసిపిలో చేరితే అనుచరవర్గమంతా కూడా హ్యాపీ! వాళ్ళకు ఇష్టమైన పార్టీలో వారికి ఇష్టమైన నాయకుడి కోసం కష్టపడి పనిచేయొచ్చు. అందుకే ఆనం టీడీపీని వీడనున్నాడన్న వార్త ఆనం అనుచరులకు ఎనలేని ఆనందాన్ని కలిగిస్తోంది.

# మున్సిపల్ విద్యార్థులు ముత్యాల్లాంటోళ్ళు

**- మంత్రి నారాయణ**

నిరుపేదలకు అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, ఎంజెఆర్‌సి ఉత్తమ ఫలితాలు తమకెంతో ఆనందం కలిగించాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ అన్నారు. ఈ నెల 15వ తేది నెల్లూరు, విఆర్ కాలేజీ ప్రాంగణంలో మునిసిపల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఈ ఏడాది ఎంజెఆర్‌సి ప్రారంభించి 49మంది విద్యార్థులతో జూనియర్ ఇంటర్ ప్రారంభించామని, 33 మంది విద్యార్థులు 10కి 10 ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలల చరిత్రలో రికార్డు సృష్టించారన్నారు. ఎంజెఆర్‌సిలో ఎక్కువ మంది విద్యార్థులు ఎస్సీఎస్టీ బిసి వర్గాలకు చెందినవారేనని, ఉత్తమ ఫలితాలను సాధించడంతో వారి కళ్ళల్లో కనిపిస్తున్న ఆనందం అంతా ఇంతా కాదంటూ, ఇంతటి ఉత్తమ ఫలితాలు నారాయణ విద్యాసంస్థల్లో కూడా రాలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ గదుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అప్పటికప్పుడు 300కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించామన్నారు. దశలవారీగా రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో ఎంజెఆర్‌సి ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ ఆలీంబాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, మాజీమంత్రి పరసా రత్నం, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మెప్మా డైరెక్టర్ చిన తాతయ్య, నారాయణ విద్యాసంస్థల సిఇఓలు రవితేజ, శరణ్య పాల్గొన్నారు.



ఎంజెఆర్‌సి విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి నారాయణ

# జనజీవనం 'బంద్' అయ్యింది



డిపోకే పరిమితమైన బస్సులు



మూతపడ్డ దుకాణాలు

ఏపికి ప్రత్యేకహోదా కోరుతూ 16వ తేదీ ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి, అఖిలపక్షాలు నిర్వహించిన రాష్ట్ర బంద్ నెల్లూరుజిల్లాలో విజయవంతమైంది. ఈ బంద్‌ను అధికార తెలుగుదేశంపార్టీ వ్యతిరేకించినప్పటికి వైయస్సార్ కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, జనసేన వంటి పార్టీలు సమర్ధించాయి. బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. ప్రత్యేకహోదా ఉద్యమంలో తాము భాగస్వాములమవుతామంటూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛంధంగా విద్యాసంస్థలను మూసివేసాయి. ప్రభుత్వ పాఠశాలలు యధావిధిగా మూతపడ్డాయి. బంద్ గురించి ముందుగానే తెలియడంతో వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఎక్కడికక్కడ డిపోల వద్దే మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు తిరగలేదు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ బంద్ వాతావరణం కనిపించింది. ఈ బంద్‌లో విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు చురుకుగా పాల్గొన్నాయి.



# సేవకు చిరునామా 'లయన్స్'

## ● ఘనంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్




బయ్యా శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

ఈ నెల 15వ తేదీన నెల్లూరు, బారా షహీద్ దర్గా వద్దగల నెల్లూరు బోట్ క్లబ్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ సమావేశం లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు రీజియన్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన నెల్లూరీయులకు సుపరిచితుడు, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యా శ్రీనివాసులు తన ప్రసంగంలో సమాజానికి తమవంతు సేవలు అందించాలనుకునే ప్రతిఒక్కరికీ లయన్స్‌క్లబ్ ఒక వేదికలాంటిదని చెప్పారు. సేవకు మించిన వ్యాపారం, సేవకు మించిన ధనం ఇంకేమీ ఉండదన్నారు. సమాజానికి నేనేం చేయగలను అనే బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి సమాజసేవకు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా బయ్యా శ్రీనివాసులు, ఆయన సతీమణి శ్రీమతి వెంకట శైలజలను లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లా డిజి లయన్ ఏవి ప్రసాద్‌ను, ఐడిజి లయన్ టి.చంద్రశేఖర్‌ను, విజిడి-2 లయన్ వి.రమేషినాథ్ రెడ్డిలను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ వి.బాబూరావు, లయన్ సిద్దా వెంకటేశ్వరరావు, లయన్ వై.సురేష్, లయన్ వై.అమృతవల్లి, లయన్ ఇపిఎస్ సురేష్, లయన్ జీవనగంగ పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# జేసీగా బాధ్యతలు తీసుకున్న సెల్వి



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెట్రి సెల్వి

విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరున్న అధికారి కె.వెట్రిసెల్వి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఈ నెల 16వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడు కళ త్తూరుకు చెందిన సెల్వి చిత్తూరుజిల్లా మదన పల్లి సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ కావడం జరిగింది. ఇప్పటివరకు ఆమె ఎక్కువ కాలం సీఎం సొంత జిల్లా చిత్తూరులోనే పని చేశారు. మంచి ఆఫీసర్‌గా అక్కడ పేరు తెచ్చు కున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ తన విధులను సక్రమంగా నిర్వహిస్తానని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక పథకాలు, జిల్లా కలెక్టర్ అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజును మర్యాదపూర్వకంగా కలిసారు.



# కనిపించని మామిడి

వేసవికాలం వచ్చిందంటే మామిడి పండ్లు స్పెషల్. ఇది సీజనల్ ఫ్రూట్. ఆపిల్, పుచ్చ,అరటి, బొప్పాయి వంటి పండ్లు అన్ని కాలాలలోనూ కనిపిస్తున్నాయి. మామిడి పండ్లు మాత్రం సీజన్ ప్రకారమే మార్కెట్ లోకి వస్తున్నాయి. అయితే ఈ సంవత్సరం ఇంకా మామిడిపండ్లు మార్కెట్‌లోకి రాలేదు. ఏప్రిల్ నెలాఖరుకే రోడ్ల మీద గుట్టలుగుట్టలుగా పోసి అమ్ముతుండే వాళ్ళు. మార్కెట్‌లో మామిడి పండ్లు పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల అకాల వర్షాలకు, ఈదురు గాలులకు పూత రాలిపోయి వుండడంతో ఈ సంవత్సరం దిగుబడి తక్కువే వుండొచ్చు. మామిడి పండ్ల రేట్లు అదిరిపోవచ్చు.

## స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి రుణాల కోసం బి.సి కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోందని బి.సి కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి ఈ నెల 14న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బి.సి కార్పొరేషన్ ద్వారా ఈబీసీలు, బీసీలు, కాపులు, ఎంబీసీలకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలి పారు. అభ్యర్థులు 21ఏళ్ళ నుంచి 50ఏళ్ళ లోపు ఉండాలని, తెల్లరేషన్‌కార్డు, ఆధార్, మీ సేవ ద్వారా పొందిన కుల ధృవీకరణ పత్రాలతో ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవా లని కోరారు.

## చిరు యువత అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

చిరంజీవి యువత నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా కె.కృష్ణారెడ్డిని నియమించారు. 16వ తేదీ హైదరాబాద్‌లోని నాగబాబు ఇంట్లో ఆయన నాగబాబు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. 2008లో చిరంజీవి యువతను స్థాపించాక ఇంతవరకు పి.చంద్రశేఖర్‌రెడ్డి, వై.రవికుమార్, కొట్టే వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా పనిచేశారు.

# సాధన ఆర్థోపెడిక్స్‌లో అరుదైన ఆపరేషన్



విలేకర్లతో మాట్లాడుతూ డాక్టర్ అశ్వినికుమార్, డాక్టర్ రామకృష్ణ, పక్కన పేషంట్ సురేష్

బెంగుళూరుకు చెందిన దాసరి సురేష్ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తీవ్ర మైన వెన్నునొప్పితో బాధపడుతూ బెంగు ళూరులోని పలు కార్పొ రేట్ హాస్పిటల్స్‌లో చూపించుకోవడం జరి గిందని, కాని ఫలితం లేకపోవడంతో ఆయన మిత్రుడి సలహామేరకు మార్చి 16న సాధన ఆర్థోపెడిక్స్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌కు రావడం జరిగిందని డాక్టర్ పాబోలు రామకృష్ణ, డాక్టర్ పోలుబోయిన అశ్వినికుమార్ తెలిపారు. ఈ నెల 13న తమ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సురేష్‌కు అన్ని పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అప్పటికే ఆయనకు రెండు కాళ్ళు చచ్చుబడిపోయి, మూత్రం ఆగిపోయి శ్వాస తీసుకోవడం కష్టతరంగా మారిందని తెలిపారు. ఇది వెన్నుపూసకు సంబంధించిన సమస్యగా గుర్తించి వెంటనే ఎంఆర్‌ఐ స్కాన్ చేయగా అందులో వెన్నుపూస చుట్టూ చీము చేరి వెన్నుపూస మీద ఒత్తిడి ఎక్కువై రెండుకాళ్ళు శాశ్వతంగా చచ్చుపడిపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే సర్జరీ చేయాలని నిర్ణయించి వెన్నుపూస చుట్టూ వున్న చీమును ఆపరేషన్ ద్వారా తొలగించడం జరిగిందన్నారు. దీంతో ఆయన మూడురోజులకల్లా వాకర్ సాయంతో నడవగలుగుతున్నారన్నారు. మూడువారాల్లో పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. పేషంట్ సురేష్ మాట్లాడుతూ చెన్నై, బెంగుళూరు వంటి మహానగరాలకు ధీటుగా ఇక్కడ వైద్యసేవలు అందుబాటులో వున్నాయని, డాక్టర్లు, సిబ్బంది చక్కగా వైద్యసేవలు అందించారని, అందుకు వారికి అభినందనలు తెలుపుతున్నానన్నారు.

# సందడిగా రెయిన్‌బో 'కలర్స్-2018'




గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో కిండర్‌గార్టన్ స్కూల్ 13వ వార్షికోత్సవం ఇటీవల స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో సందడిగా జరిగింది. 'కలర్స్-2018' అనే పేరుతో ప్లేక్లాస్, ఎల్‌కెజి, యుకెజి నర్సరీ చిన్నారు లకు ఉత్సాహభరితంగా ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టారు.. వెల్‌కమ్ డ్యాన్స్‌తో 'కలర్స్-2018 ప్రీ ప్రైమరీ'ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుకెజి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అయిదేళ్ళలోపు చిన్నారులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ, వారి వ్యక్తిగత విషయాల్లో ఎంత బిజీగా ఉన్నా సరే తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలకు కేటాయించి వారితో గడపాలన్నారు. పిల్లలు ప్రతిభతో వారికి ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన వెల్‌కమ్ డ్యాన్స్, చాకొలెట్ డ్యాన్స్, ముత్యాల చెమ్మచెక్క తదితర నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ టీం లీడర్ ఫాతిమాఖాన్, ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, కలివెలపాళెం సిబిఎస్‌ఇ పాఠశాల ప్రిన్సిపల్ రామగిరి విద్యాసాగర్, కొరియోగ్రాఫర్స్ నంథన్, సురేష్, గోపి పాల్గొన్నారు.

# ఫిజియోథెరపిస్టుల సంఘం




నూతనంగా ఏర్పడ్డ ఫిజియోథెరపిస్టుల సంఘం సభ్యులు

కీళ్ళు, కాళ్ళు, ఎముకలు, నరాల వ్యాధులకు సంబంధించి సంబంధిత డాక్టర్ల సేవలు ఎంత అవసరమో, ఫిజియోథెరపిస్టుల సేవలు కూడా అంతే అవసరం. పేషంట్ పూర్తిగా కోలుకోవడంలో వీరి పాత్ర చాలా వుంటుంది. జిల్లాలో వున్న ఫిజియోథెరపిస్టు లందరూ ఒక సంఘంగా ఏర్పడ్డారు. 15వ తేదీ నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో నెల్లూరుజిల్లా ఫిజియోథెరపిస్టుల సంఘానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ విజయకృష్ణ, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ మల్లిఖార్జున, కార్యదర్శిగా డాక్టర్ అజయ్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ బలరామ్, కమిటీ సభ్యులుగా డాక్టర్ ఆర్.శ్రీకర్, డాక్టర్ అవినాష్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ రాకేష్, డాక్టర్ మల్లిఖార్జున, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ షాలిని, డాక్టర్ శ్రీలేఖలను ఎన్నుకున్నారు.

# 24 నుండి కొండపై నరసింహుని తిరునాళ్ళు



కరపత్రాలు విడుదల చేస్తున్న దేవస్థానం పాలకమండలి సభ్యులు

నెల్లూరురూరల్ మండలం నరశింహకొండలోని వేదగిరి క్షేత్రంలో వెలసివున్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి మే నెల 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఛైర్మన్ మల్లినేని వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నరశింహకొండలోని దేవస్థానంలో బ్రహ్మోత్సవ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24న అంకు రార్పణ, 25న ధ్వజారోహణ, శేషవాహనసేవ, 26న చప్పర ఉత్సవం, హంసవాహన సేవ, 27న చప్పర ఉత్సవం, సింహ వాహన సేవ, 28న హనుమంత సేవ, పూలంగి సేవ, బంగారు గరుడసేవ, 30న కళ్యాణోత్సవం, గజవాహన సేవ, పూలంగి సేవ, మే 1న రథోత్సవం, 2న చప్పర ఉత్సవం, అశ్వవాహన సేవ, 3న ఏడుకొనేర్ల వద్ద తీర్థవాది, ధ్వజావరోహణ, 4న ఏకాంతసేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆలయ పాలకవర్గ సభ్యులు ఉప్పల ఈశ్వరయ్య, నెల్లూరు రూపనీలక్ష్మీదేవి, ఎక్స్ అఫిషియో సభ్యులు మాధవగిరి వెంకట అప్పలాచార్యులు పాల్గొన్నారు.

# వయసులో చిన్న.. సేవల్లో మిన్న!

## సేవోత్సవంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి జన్మదినోత్సవం

ఈ కాలంలో కుర్రాళ్ళు... రేస్‌బైక్‌లపై రేస్ గుర్రాల్లాగా దూసుకు పోవాలనుకుంటారు... కారుల్లో షికార్లు కొట్టాలనుకుంటారు... బారుల్లో కూర్చుని బీర్లు కొట్టాలనుకుంటారు... గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి పార్కులకు, పబ్‌లకు పోవాలనుకుంటారు... కాని ఆ కుర్రాడికేంటో... సేవా కార్యక్రమాలంటే సరదాగా వుంటుంది. అనాధాశ్రమాలకు వెళ్ళాలంటే ఎక్కడలేని హుషారొస్తుంది. ఎవరికన్నా సాయం చేయాలంటే ఎనలేని శక్తి వస్తుంది. మూడు పదులు కూడా నిండని వయసులో సమాజం గురించి ఎంతో బాధ్యతగా ఆలోచించి అడుగులు వేస్తున్న ఆ యువకుడే మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు). ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి కుమారుడు.



బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు)

మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ద్వారా నెల్లూరులో గత కొన్నేళ్ళుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. విద్య, వైద్య, క్రీడా రంగాలలో ఎందరినో ఆదుకుంటున్నాడు. ఈ పరంపరలో భాగంగానే ఈ నెల 15వ తేదీన మాగుంట శరత్‌చంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు టౌన్ హాలులో మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యాన భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్టార్ డెంటల్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరాన్ని, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వారితో కలిసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి పేద రోగులకు వైద్య సేవలందించారు.

ఈ సందర్భంగా స్టార్ డెంటల్ ఆసుపత్రి నిర్వాహకుడు డా॥ హరికృష్ణ రోగులకు 300 రూపాయల విలువ చేసే ఉచిత వైద్య ఓచర్‌లను, ఒక డెంటల్ పేస్ట్‌ను అందజేశారు. అలాగే వాసన్ ఐకేర్ వాళ్ళు ఏప్రియల్15 నుండి మే15 వరకు శరత్‌చంద్రారెడ్డి సిఫార్సుతో వచ్చిన రోగులకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు.

అలాగే భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా శరత్‌చంద్రారెడ్డి అభిమానులు, స్నేహితులు దాదాపు 209 యూనిట్ల రక్తాన్ని దానం చేసారు. ఈ సందర్భంగా మహిళలకు 400చీరలు, 5 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం వెయ్యిమందికి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సేవోత్సవానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసి జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మాగుంట వెంకటనారాయణరెడ్డి, నగర డిఎస్పీ మురళీకృష్ణలు మాగుంట శరత్ చంద్రారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను మెచ్చుకుంటూ తమ అభినందనలు తెలిపారు. పుట్టిన రోజును ఇలా పేదలకు పండుగ రోజుగా మలచిన ఘనత శరత్ చంద్రారెడ్డికే దక్కుతుందన్నారు.

### సేవే లక్ష్యంగా..

### 'మన ఊరు మన బాధ్యత'

ఈ జన్మదినాన్ని పురస్కరించుకుని శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ఇక నుండి ప్రతియేటా ఇద్దరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించుకున్నానని, అలాగే "మన ఊరు మన బాధ్యత" అన్న నినాదంతో సేవే లక్ష్యంగా కార్యక్రమాలను విరివిగా ప్రజలలోకి తీసుకెళ్ళి సమాజం పట్ల మనకున్న బాధ్యతని నేటి పౌరులకు, అలాగే రేపటి తరానికి తెలియజేయడానికి విశేషంగా కృషి చేస్తానని చెప్పారు. తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడమే కాకుండా తానిచ్చిన పిలుపు మేరకు వివిధ సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి సభ్యులకు ఆయన కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలను తెలుపుకున్నాడు.



ముఖ్యఅతిథుల చేతుల మీదుగా మహిళలకు కుట్టుమిషన్లు, చీరలు పంపిణీ చేస్తున్న చందు

# ప్రతిభ'కీర్తి'కి లాయర్ అభినందన



- రత్నం మాష్టారు సమక్షంలో లక్ష్మీకీర్తిని సత్కరించిన శివప్రభాత్‌రెడ్డి

ఇంటర్మీడియట్ ర్యాంకుల విధానానికి స్వస్తి పలుకుతున్న తరుణంలో చివరిసారిగా ప్రకటించిన ర్యాంకులలో మొదటి స్థానం సాధించిన సింహపురి చిన్నారి, రత్నం జూనియర్ కాలేజీ విద్యార్థిని "లక్ష్మీకీర్తి"ని 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి అభినందించాడు. సింహపురి కీర్తిపతాకాన్ని రెపరెపలాడిస్తూ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న "రత్నం" మాష్టారుకి కూడా ఈ సందర్భంగా 'లాయర్' పత్రిక పక్షాన అభినందనలు తెలిపాడు.

# మీ దీవెనలే నాకు ధైర్యాన్నిస్తాయి

## ఇంటింటికీ తిరుగుతున్న శ్రీధర్‌రెడ్డి



చెల్లెమ్మతో రాఖీ కట్టించుకుంటున్న అన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

స్త్రీని ఆదిశక్తిగా పూజించే పవిత్ర భారతదేశంలో నిండు మనస్సుతో మహిళలు దీవించే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అంటున్నాడు. ఈ నెల 17వ తేదీన ఆయన నెల్లూరు 23వ డివిజన్‌లోని సప్తగిరి లే అవుట్‌లో ఇంటింటికి తిరిగాడు. ఈ నెల 26వ తేదీ నుండి తాను చేపట్టబోయే 366రోజుల ప్రస్థానంకు మీ ఆశీస్సులు కావాలంటూ మహిళలను అభ్యర్థించాడు. మహిళలు ఆయనకు అక్షింతలు వేసి, కొందరు బొట్లు పెట్టి, మరికొందరు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో, ఎక్కడ సంతోషంగా వుంటారో ఆ ప్రాంతం అన్ని రకాలుగా బాగుంటుందని, అందుకే 1005 మంది మహిళల ఆశీస్సులు తీసుకుని 366 రోజుల ప్రజాప్రస్థానం ప్రారంభించబోతున్నట్లు శ్రీధర్‌రెడ్డి చెబుతున్నాడు.

# సైకిల్ తొక్కుతాం.. హోదా సాధిస్తాం...

## • జిల్లాలో సైకిల్‌యాత్ర ఖరారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రత్యేకహోదా సాధన కోసం విపక్షాలన్నీ నిరాహారదీక్ష, బంద్‌లు, రైల్‌రోకోలు వంటి మార్గాన్ని ఎంచుకుంటే నెల్లూరు జిల్లా తెలుగుదేశం నాయకులు మాత్రం సైకిళ్లు తొక్కాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఐదుకోట్ల ఆంధ్రులను మోసం చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ నమ్మక ద్రోహం చేసాడు. ప్రభుత్వ నీతిబాహ్య రాజకీయాలపై దండయాత్ర మాదిరిగా ఈ సైకిల్‌యాత్రను చేపట్టాలని 15వ తేదీ నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్న సమావేశంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కంభం విజయరామిరెడ్డి, పార్టీ నాయకులు అనూరాధ, ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు నిర్ణయించారు.

ఈ నెల 21వ తేదీన ఉదయగిరి నుండి ఈ సైకిల్‌యాత్రను మొదలుపెట్టాలని నిర్ణయించారు. 15రోజుల పాటు ఈ యాత్ర వుంటుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ సైకిల్ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయగిరి నుండి సైకిల్‌యాత్ర నిర్వహించాలన్న నిర్ణయానికి సెంటిమెంట్‌ను జోడించారు. 2008లో ఇక్కడ నుండి చైతన్యయాత్ర చేయబట్టే 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిందంట. ఇప్పుడు ఉదయగిరి నుండే సైకిల్‌యాత్ర మొదలుపెడితే 2019లోనూ మనదే అధికారం అని టీడీపీ నాయకులు బలంగా విశ్వసిస్తున్నారు.

15రోజుల పాటు సాగే ఈ సైకిల్ యాత్రకు కంభం విజయరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలను సమన్వయకర్తలుగా నియమించారు.

# ఇళ్ళ నిర్మాణంలో నెల్లూరు ఫస్ట్

**- జిల్లా కలెక్టర్**



గృహ నిర్మాణాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రధమస్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. ఈ నెల 16న గృహ నిర్మాణశాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహనిర్మాణాల ప్రగతిని సమీక్షించేందుకు ఒక యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని, క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు ఆ యాప్‌ను ఉపయోగించుకుని ఆయా గృహ సముదాయాల పురోగతిని సమీక్షించుకోవాలని కోరారు. అందుకు వారు ప్రతి ఇంటిని సందర్శించి ఫోటోలు తీసి ప్రతి మంగళవారం యాప్ ద్వారా పంపాలని పేర్కొన్నారు. మునిసిపాలిటీల్లో కూడా ఇదే విధానం అనుసరించాలన్నారు. లక్ష్యాలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ఫోటోలు తీసి ప్రతి మంగళవారం యాప్ ద్వారా పంపాలని పేర్కొన్నారు. మునిసిపాలిటీల్లో కూడా ఇదే విధానం అనుసరించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4435ఇళ్ళు మంజూరయ్యాని, అందులో 188 మందికి స్థలాలు లేవని, వారికి కూడా స్థలసేకరణ చేపట్టాలని కోరారు. జాయింట్ కలెక్టర్-2 వెంకట సుబ్బారెడ్డి, గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కాంట్ కలదు

# అప్రమత్తతో అగ్నిప్రమాదాలు దూరం

**- అగ్నిమాపక అధికారి దేవానందం**



అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు అగ్నిమాపక అధికారి దేవానందం అన్నారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా సిబ్బంది ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన అపార్ట్‌మెంట్లలో ఏ విధంగా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చో స్థానికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రమణయ్య, చంద్రశేఖర్, నరసింహం, స్థానికులు జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగి నడిపిన వాళ్ళకు శిక్ష పడింది...



మద్యం తాగి వాహనాలు నడిపిన 36మందికి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఇటీవల గూడూరు 1వ పట్టణ రక్షణ నిలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ వి.ఎస్.రాంబాబు తెలిపారు. డ్రంక్ & డ్రైవ్ విధానాన్ని కఠినంగా అమలు చేయడం జరుగుతుందని వాహనదారులు మద్య పానానికి దూరంగా వుండాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రూరల్ సి.ఐ అక్కేశ్వరరావు, ఎస్సైలు మరియు సిబ్బంది.

# కన్నుల పండువగా సీతారాముల పెళ్ళి

**• ఆధ్యాత్మికతను చాటిన చాగంటి ప్రవచనాలు**



చాగంటిని సన్మానిస్తున్న నిర్వాహకులు



ప్రవచనాలను వింటున్న భక్తులు


గూడూరు పట్టణంలోని సిఆర్ రెడ్డి కళ్యాణ మండపం ఆవరణంలో ఈ నెల 14న ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు సీతారాముల కళ్యాణాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. శ్రీరాముడు నరుడి మాదిరిగానే తల్లి గర్భంలో కటిక చీకటిలో 12 నెలలు ఉండి సాధారణ పిల్లవాడిలా జన్మించాడన్నారు. ఆయన తన జీవితంలో ఎక్కడా దైవత్వాన్ని ప్రదర్శించలేదన్నారు. సాధారణ మానవుడిలానే జీవనం సాగించారని తెలిపారు. రామాయణాన్ని చదవడం ద్వారా మానవులు ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవచ్చన్నారు. మానవజాతికి శ్రీరాముడి జీవన విధానం ఆదర్శప్రాయమన్నారు. సీతమ్మ మాత్రం నరకాంత కాదని, జనకుడి నాగలికి తగిలి



## గూడూరు డివిజన్ వార్తలు

పైకి లేచిందన్నారు. అనుబంధం తెలిస్తేనే బంధం తెలుస్తుంది. అందుకే సీతమ్మపైకి లేవగానే ఆయన ఆకాశం వైపు చూసి అశరీరవాణిని ఆమెతో తనుకున్న బంధం ఎలాంటిదో తెలుసుకుని, ఆ వాణి ప్రకారమే సీతమ్మను తన కుమార్తెగా పెంచి పెద్దచేసారని వివరించారు. కాగా, ఆదివారం కన్నులపండువగా రుక్మిణీ కళ్యాణం జరిగింది. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచేకాకుండా పరిసర గ్రామాల నుంచి కూడా అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు. శ్రీకృష్ణుడు, రుక్మిణీలను మండపంలో ఉంచి వారికి ప్రత్యేకాలంకరణ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా వారి వివాహాన్ని వైభవంగా నిర్వహించారు. రుక్మిణీ కళ్యాణాన్ని తిలకిస్తే కన్యలకు ఉత్తమ గుణాలు కలిగిన భర్తలు దొరుకుతారని మహోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో కన్యలు హాజరై కళ్యాణం చూసి తరించారు. ఆయన ప్రవచనాలు భక్తిశ్రద్ధలతో విన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, కోట సునీల్‌కుమార్‌స్వామి, కోడూరు మీరారెడ్డి, సాయికుమార్‌రెడ్డి, చంద్రశేఖరయ్యలు చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైయస్సార్సీపీ నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రాజ్యలక్ష్మి, కోడూరు కల్పలత తదితరులు పాల్గొన్నారు.




"పరిశోధనాత్మక" పద్య ప్రయోగం...

# రుక్మిణీ కల్యాణము

**(నానావిధ ఛ్ఛంధ:పద్య పుష్పహారము)**



రచన:
**విద్వాన్ చక్రాల లక్ష్మీకాంతరాజారావు**
వెల : రూ.125/-
ప్రతులకు :
చక్రాల లక్ష్మీకాంతరాజారావు
కేరాఫ్ డి.ఎల్ మహేష్ రాజశ్రీ
18-805-2, తిలక్‌నగర్, గుంతకల్లు
అనంతపురం జిల్లా.
ఫోన్ : 9291333880

నన్నయభట్టు నుండి నేటివరకు తెలుగు సాహిత్యరంగంలో పద్య కవిత్వం తన ఉనికి కాపాడుకుంటూనే వస్తున్నది. పద్యాల నడుములు విరగ్గొడతానన్నా, కొందరు పద్యాన్ని అవహేళన చేసినా, అందులో స్వేచ్ఛ లేదని అన్నా, అదరక బెదరక సరళసుందరంగా, భక్తి ప్రబోధాత్మకంగా, అలనాటి మహాకవుల కావ్యాలను స్మృతికి తెస్తూ నేటి కాలంలో కూడా కొందరు కవులు పద్యాన్ని బ్రతికిస్తూ ఉన్నారు. కేవలం బ్రతికించడమే కాదు, అందమైన ఆభరణాలతో అలంకరించినట్లుగా, నూత్న వృత్తాలతో తెలుగు కవితాలలామకు వింత సోయగాల్ని దీపింపజేసిన మహాకవులు ఎంతోమంది ఉన్నారంటే అతిశయోక్తికాదు. ఆ కోవలో ఉత్పలమాల, చంపకమాల, తేటగీతి, ఆటవెలది, సీసం వంటి లెక్కింపదగిన ఛందస్సులే కాక, వందల కొలదీ నూత్న ఛందస్సులను ప్రయోగించి, సరళంగా.. సున్నితంగా.. భావపుష్టితో సమగ్రమైన కావ్యాన్ని రచించి నేటి గేయకవులకు కూడా ఆనందాశ్చర్యాలను కలిగించిన మహాకవి చక్రాల లక్ష్మీకాంతరాజారావు. వీరు మహాభాగవతంలోని రుక్మిణీ కల్యాణమనే ప్రసిద్ధ ఇతివృత్తాన్ని తీసుకుని దాదాపు మూడువందలకు పైగా సంప్రదాయ వృత్తాలను సందర్భోచితంగా ప్రయోగించి సాహితీలోకాన్ని విస్మయచకితుల్ని చేశారు. పద్య రచన శ్రమతో కూడినదని, గణాలు యతిప్రాసల కోసం ప్రాకులాడాలని పద్యకవిత్వాన్ని నిరసించే రచయితలకు కూడా ఈ గ్రంథం పునరాలోచనను కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

శ్రీ చక్రాల లక్ష్మీకాంతరాజారావు హైదరాబాద్ మొహిదీపట్నంలోని శ్రీచైతన్య కళాశాలలో సంస్కృతోపన్యాసకులుగా పనిచేస్తున్నారు. భగవంతుని కృపతో వీరికి పద్యకవితా శైలి అలవడింది. అత్యద్భుతంగా అవధానాలు చేసి, 'అవధాన భారతి'గా పేరు గడించారు. 'సాహితీ చతురాననులు'గా ప్రఖ్యాతిగాంచారు. శ్రీ లలితా శతకము,




శ్రీరామ కథాతరంగిణి, శ్రీ వేంకటేశ్వర కల్యాణము తదితర అద్వితీయమైన గ్రంథాలు రచించి ఉత్తమ పద్యకవిగా విఖ్యాతిచెందారు.

**1. కథాంశము :** వసుదేవుని గుణాలు, పూతన పాలివ్వడం, కృష్ణుని చిలిపి చేష్టలు, యశోద మందలింపు రుక్మిణీ సందేశము, కృష్ణుని సమాధానము వంటి ముఖ్యమైన ఘట్టాలు ఇందులో చక్కగా వర్ణింపబడ్డాయి. 'నీవు రాకున్నచో నేనెట్లు భుజియింతు, నీవు నేనైనయుండ శ్రీవిలాస' అని రుక్మిణీదేవి కృష్ణునికి సందేశం ఇచ్చింది. దీనిలో జీవాత్మ పరమాత్మల అభేదం వ్యక్తమవుతూ ఉంది. ఇలా అడుగడుగునా కథాంశంలో కవి ప్రతిభ వ్యక్తం అవుతూ ఉంది.

**2. రసపోషణ :** ఇది శృంగార రస ప్రధాన కావ్యం. ఆయా సందర్భాలకు తగినట్లుగా పద్యరచన చేశారు. అక్కడక్కడా మంజరీ ద్విపదను ప్రయోగించి స్త్రీల పాటలను గుర్తుకు తెస్తున్నారు.

**3. భావసంయోజన :** సందర్భోచితంగా భావాన్ని కవిత్వంలో ఇమడ్చగలిగి మనకు ఆనందాన్ని కలిగించారు. రుక్మి రుక్మిణికి సుద్దులు చెప్పే ఘట్టంలో మధ్యతరగతి వారి సందర్భోచిత సంభాషణా విధానం ద్యోతకమవుతూ ఉంది.

**4. ఛందోవైవిధ్యం :** ఈ గ్రంథంలో ముఖ్యమైన అంశం దాదాపు మూడువందలకు పైగానే విశేష వృత్తాలను సందర్భోచితంగా, రసోచితంగా, అలవోకగా ప్రయోగించి ఈ కవి ఈ కావ్యాన్ని 'న భూతో న భవిష్యతి'గా రచించారు. 'తరువోజ భుజంగ విజృంభితము' వంటి వృత్తాలనే కాక, అన్ని సీస భేదాలను, కంద పద్య భేదాలను, ఇరవై నాలుగు ఛందస్సులలో గల వివిధ వృత్తాలను, రగడలను, అక్కరలను, కళికోత్కళికలను సందర్భోచితంగా ప్రయోగించి కవి తనలోని విశేష ప్రతిభా పాటవాలను ప్రకాశింపజేసుకున్నాడు. లక్షణకారులైన అనంతుడు, అప్పకవి వంటివారు తమ గ్రంథములలో వృత్త భేధము లెన్నిటినో ఉదహరించినారు. అట్టివారి కృషి సఫలం కావాలని ఆశించి, వారిపై గౌరవముంచి, ఆ వృత్తాలన్నింటిని శ్రీ రాజారావుగారు తన కావ్యంలో ప్రయోగించి, వారి కృషికి సాఫల్యాన్ని కలిగించడమే కాక, వారియెడల తనకు గల భక్తిప్రపత్తులను చాటుకుని, కవితా రంగంలో ఛందోవైవిధ్యంతో రచనా విప్లవాన్ని సాధించిన మహాకవి శ్రీ చక్రాల లక్ష్మీకాంతరాజారావు. ప్రారంభంలోనే 'శ్రీ', 'వి' 'ష్ను' 'శా' అని ఏకాక్షరం గల ఛందస్సును ప్రయోగించి శ్రీ వృత్తాన్ని, తరువాత స్త్రీ వృత్తాన్ని (రెండక్షరాల ఛందస్సు) వ్రాసి పాఠకులకు ఛందోభిమానాన్ని కలిగించారు. ఛందోరచనా రంగంలో శ్రీ రాజారావు అగ్రస్థానాన్ని అలంకరించారు. తెలుగు పద్య కవితాభిమానులు ఈ ఛందోవైవిధ్యం గల పద్య పుష్పహారాన్ని ధరించి తాము కూడా అమందానందాన్ని పొందగలరని ఆశిస్తున్నాను.



సమీక్ష:
**డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు**
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు, నెల్లూరు
ఫోన్ : 9908855294

## పన్నులు సకాలంలో చెల్లించండి

**- గూడూరు కమిషనర్ నరేంద్ర**



గూడూరు పురపాలక పరిధిలో ఇంటి, కొళాయి, తదితర పన్నులను సకాలంలో చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు. గూడూరు పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018-19 సంవత్సరానికి పన్నులు చెల్లించే వారందరూ ఈ నెల 30వ తేదీ లోగా చెల్లిస్తే 5శాతం తగ్గింపు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గతంలో పెండింగ్‌లో వున్న పన్నులు త్వరితగతిన చెల్లించాలని లేదంటే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. వేసవి కాలంలో పట్టణంలో స్వచ్ఛంధ సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్‌ను ప్రధానిని చేయడమే మోడీ లక్ష్యం

శ్రీను గల్పిక

భేతాళకథ

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్ థర్టీకల్లా నిద్రలేచాడు. కాలకృత్యాలు ముగించుకుని మురళీకృష్ణ హోటల్ కొచ్చాడు. రెండు ఇడ్లీల్లో రెండు బకెట్ల సాంబార్ కలుపుకుని తిని కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు పై నిలబడ్డాడు. వెంటనే అతని ముందు పది ఆటోలు రాకెట్‌వేగంతో దూసుకొచ్చి ఆగాయి. ఒకరు చేయి, ఒకరు కాలు పట్టుకుని లాగుతూ ఆటోవాలాలు తమ ఆటోలో ఎక్కించుకునే ప్రయత్నం చేసారు. విక్రమార్కుడు వారి నుండి బలవంతంగా బయటపడి చివరకు ఒక ఆటోలో కూలబడ్డాడు. ఆయన ఆ వెంపర్లాట నుండి హమ్మయ్యా అనుకుంటూ ఊపిరి పీల్చుకునేలోపే పెద్దాసుపత్రి గేటు ముందు ఆటో ఆగింది. విక్రమార్కుడు మనసులో... నెల్లూరు ఆటోవాలాలు ఇంతకుముందు విమానాలు తోలేవాళ్ళ లాగున్నారు. ఆటోలను విమానాలు లాగే తోలుతున్నారను కుంటూ ఆటోవాలాకు 10రూపాయలిచ్చి పెద్దాసుపత్రిలోకి పోయాడు. మార్చురీ లోపలకు వెళ్ళి అప్పుడే రోడ్డు ప్రమాదంలో మరణించిన ఫ్రెష్ బాడీని భుజాన వేసుకుని జీఎన్‌టీ రోడ్డు పైకి వచ్చి నడవసాగాడు. యం.జి మాల్ వద్దకొచ్చే సరికి కాస్తున్న ఎండ దెబ్బకు విక్రమార్కుడికి చెమటలు కారసాగాయి. ఇంత దూరం వచ్చినా ఈ భేతాళుడిలో ఉలుకుపలుకు లేదేంటబ్బా అనుకుంటూ... భేతాళ, భేతాళ అంటూ బాడీని తట్టాడు. అప్పుడు బాడీలోని భేతాళుడు... ఆ... విక్రమార్క, చెప్పు ఈ ఎండదెబ్బకు నాకు కళ్ళు తిరిగి పడిపోయాను. నువ్వు తట్టడంతో స్పృహ వచ్చింది. అయినా మనుషులు రోడ్డమీద తిరగడానికి భయపడుతున్న ఈ ఎండల్లో నువ్వు పడుతున్న కష్టం చూస్తుంటే నాకు జాలేస్తుంది. నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు 'అక్క కల నెరవేర్చిన తమ్ముడు' స్టోరీని చెబుతాను. అలా మినర్వా బ్లూ ఫాక్స్ బార్‌లోకి వెళ్ళి బీర్ కొడుతూ మాట్లాడుకుందాం పద అని బార్‌లోకి తీసుకెళ్లాడు. బీర్లు ఆర్డర్ చేసి అవి వచ్చాక తాగుతూ... భేతాళుడు స్టోరీ మొదలుపెట్టాడు. కేంద్రంలో పదేళ్ళ మన్మోహన్‌సింగ్ పాలనపై వ్యతిరేకతతో 2014లో దేశ ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు. ఎన్డీఏను అధికారంలో కూర్చోబెట్టారు. నరేంద్ర మోడీని ప్రధాన మంత్రిని చేసారు. అభివృద్ధిలో గుజరాత్‌ను నెంబర్‌వన్‌గా నిలిపిన మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని ఆశించారు. దేశంలో అనేక సంక్షేమ పథకాలు వస్తాయి, జాతీయ రహదారులు అభివృద్ధి చెందుతాయి, నదుల అనుసంధానం జరుగుతుంది, కుంభకోణాలు ఆగుతాయి, ఉగ్రవాదం ఆగిపోతుంది, ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతి అంతమవుతుంది, ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలొస్తాయని ప్రజలు ఆశపడ్డారు. నిజాయితీపరుడైన నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం వెలిగిపోతుందని భావించారు. కాని ప్రజలు ఆశించింది వేరు... మోడీ ప్రధాని అయ్యాక జరుగుతున్నది వేరు. ప్రధాని అయ్యాక ఆయన స్వదేశంలో కంటే విదేశాలలో వున్నది ఎక్కువ. ఒక్క శాశ్వతమైన అభివృద్ధి ప్రాజెక్ట్‌ను కూడా చేపట్టలేదు. అంతేకాదు, నోట్ల రద్దు, జీఎస్టీ వంటివి తెచ్చి తన మీద తన ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్నాడు. ప్రజలను వివిధ రకాల పన్నుల రూపంలో భయపెడుతున్నాడు. ఈ బీజేపీని ఎందుకు గెలిపించాంరా బాబు అనే పరిస్థితి కల్పిస్తున్నాడు. మోడీ తలచుకుంటే దేశాన్ని ఎంతో అభివృద్ధి చేయవచ్చు. ప్రజలు సంతోషించేలా అనేక కార్యక్రమాలు చేయవచ్చు. దేశంలో తన పాలన మీద అసంతృప్తి పెరుగుతుందని తెలిసి కూడా నరేంద్ర మోడీ ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలు ఎందుకు తీసుకుంటున్నట్లు... దీనికి సమాధానం తెలిసి కూడా చెప్పక పోయావో నారా లోకేష్‌కు తెలుగు పాఠాలు చెప్పే మాస్టార్‌వై పత్రికలకెక్కుతావని హెచ్చరించాడు.

దానికి విక్రమార్కుడు... దీనికి సమాధానం చెప్పను, చూపిస్తాను అంటూ తన ఐ ఫోన్ తీసి ఒక వీడియో ఆన్ చేసాడు. అది ప్రధానమంత్రి కార్యాలయం. మోడీ కొత్తగా ప్రధాని అయ్యున్నాడు. కొత్త ప్రధాని మోడీకి శుభాకాంక్షలు చెప్పడానికి సోనియాగాంధీ వచ్చింది. ఖర్మకాలి అదేరోజు రక్షాబంధన్ కూడా! ఆమె మోడీ చేతికి పూలబొకే ఇచ్చి, ఆ వెంటనే తన చేతిలో వున్న రాఖీని మోడీ చేతికి కట్టింది. దాంతో మోడీ ఆమెతో ఆప్యాయంగా... నువ్వు ఇండియాలో జన్మించకపోయినా ఇటలీలో పుట్టినా నాకు అక్కలాంటి దానివే... సొంత తమ్ముడిలా భావించి రాఖీ కట్టావు. శత్రురాజు భార్య వచ్చి చేతికి రాఖీ కడితే ప్రాణభిక్ష ప్రసాదించిన పురుషోత్తముడి వారసుడిని, నీకేం కావాలో కోరుకో అక్కా... అని అడిగాడు. అప్పుడు సోనియా, నా బొందిలో ప్రాణముండగానే నా బిడ్డ రాహుల్‌ను ప్రధానిగా చూడాలని వుంది. మీరు సక్రమంగా పరిపాలన సాగించి ప్రజల ఆదరాభిమానాలు పొందితే నా బిడ్డ ఈ జన్మకు ఈ దేశ ప్రధాని కాలేడు. నా బిడ్డ ప్రధాని కావాలన్న కోరిక తీరుస్తావో, లేక ఈ అక్కకు ఇచ్చిన హామీని మరుస్తావో నీ ఇష్టం అంటూ సోనియా పమిట చెంగు నోట్లో కుక్కుకుని ఏడుస్తూ వెళ్ళిపోయింది. ఐ ఫోన్‌లో వీడియో అక్కడితో ఆగిపోయింది. తర్వాత విక్రమార్కుడే... ఈ సీన్ చూసాక నీకు అర్థమై వుంటుంది. తాను సక్రమంగా పరిపాలిస్తే తర్వాత కూడా బీజేపీయే అధికారంలోకి వస్తుందని, సోనియా హయాంలో రాహుల్ ప్రధాని కావడం కష్టమని భావించిన మోడీ ఇలా అడ్డదిడ్డంగా పరిపాలిస్తూ... వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడానికి పరోక్ష సహకారమందిస్తున్నాడని చెప్పాడు. ఆ జవాబుతో సంతృప్తి చెందిన భేతాళుడు... మరో రెండు బీరు బాటిళ్ళు చేత పట్టుకుని బాడీని అక్కడే వదిలేసి సమీపాన వున్న సెల్‌టవర్ ఎక్కేసాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

రావలసిన బాకీలు కొంతమేరకు అందుతాయి. ఉద్యోగులకు కార్యసామర్థ్యంతో పాటు, పనిభారం అదనంగా ఉంటుంది. ప్రయాణాలుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. విద్యావృద్ధి కలదు. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం బాగుండి ఆదాయం పెరుగుతుంది. త్రోసిపుచ్చలేని అదనపు ఖర్చులు కూడా ఉంటాయి. ఆర్థిక ఇబ్బందులుండవు. మానసికంగా స్థిమితపడతారు.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2పాదాలు

ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్త పడండి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోనలేని పరిస్థితులుండవచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనవసర విషయాల జోలికి పోకూడదు. విద్యార్థులు మరింత కష్టపడాలి. ఆర్థిక సమస్యలతో పాటు బయట వ్యవహార వత్తిడి ఆందోళన కలిగిస్తుంది.

## మిధునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల విలువల లావాదేవీలు వాయిదా వేసికొనాలి. ఆరోగ్యం ఫరవాలేదు. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగులకు ఇతర బాధ్యతలు చేయవలసి రావడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. వ్యవహార, ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం. ఉద్యోగార్థులకు కొంత మేలు జరుగుతుంది. ఇంట్లో వారితో భేదాభిప్రాయాలు, సమస్యలు రాకుండా చూచుకొనాలి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేష

అధికారులకు పెరిగిన బాధ్యతల వల్ల శ్రమ, ఉద్యోగులకు కార్యసామర్థ్యం బాగుంటుంది. మీకు సంబంధం లేని విషయాలలో తలదూర్చవద్దు. వైద్య సాంకేతిక రంగాల వారికి గౌరవ గుర్తింపులుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త వస్తు వస్త్రాలు సమకూరుతాయి. ముఖ్యమైన పత్రాలు అందుకొంటారు. ఉద్యోగులు విధి నిర్వహణ ప్రశాంతంగా సాగుతుంది. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. ప్రయాణాల వల్ల మేలు జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఆలోచనలు కార్యరూపం దాల్చక పోవచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. దుబారా ఖర్చులు తప్పనిసరి కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉపాధి, మార్కెటింగ్ రంగాల వారికి అభివృద్ధి బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. పెళ్ళి ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలము. కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఉద్యోగులకు పనిభారం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు పెరిగి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

### రాశి - మీ వాసి

తేది. 20.4.2018 నుండి
తేది. 26.4.2018 వరకు

ఈ వారం మీనంలో బుధుడు, మేషంలో రవి, వృషభంలో శుక్రుడు, వృషభ మిధున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శనికుజులు, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము : ముహూర్తములు**

22.4.2018 ఆదివారం ఉదయం 3.40 నుండి 5.16 వరకు మీన లగ్నంలో వివాహము.

26.4.2018 గురువారం రాత్రి 7.30 నుండి 9.40లోగా వృశ్చిక లగ్నంలో గృహ ప్రవేశ, వివాహములు. 20తేది ఆదివారం జగద్గురు శ్రీ ఆదిశంకర జయంతి. ఈరోజు ఉపనయనమునకు లగ్నము లేదు.

**వైశాఖ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | పంచమి | రా॥ గం.11.12వ॥ |
| తేది. 21 | శని | షష్ఠి | రా॥ గం.8.48వ॥ |
| తేది. 22 | ఆది | సప్తమి | రా॥ గం.6.20వ॥ |
| తేది. 23 | సోమ | అష్టమి | సా॥ గం.4.0వ॥ |
| తేది. 24 | మంగళ | నవమి | ప॥ గం.1.36వ॥ |
| తేది. 25 | బుధ | దశమి | ప॥ గం.11.27వ॥ |
| తేది. 26 | గురు | ఏకాదశి | ఉ॥ గం.9.37వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సమస్యలు పెండింగ్‌లోనున్నవి పరిష్కారం కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. అనుకోని ధన, వస్తు లాభం ఉండవచ్చును. బంధు మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. విద్యాప్రగతి బాగుంటుంది. మంచి ఆర్థికావకాశాలు, ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి. ఆదాయం తృప్తికరము.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహనములు నడిపేవారు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగాలి. చిన్నచిన్న పొరపాట్ల వల్ల మాటలు పడవలసిరావచ్చును. శుభకార్య ప్రయత్నాలు ఫలించకపోవచ్చును. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి. సభలు, సేవా కార్యాలలో పాల్గొంటారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బంధువర్గంతో ఏదో ఒక రూపంలో విభేదాలు రావచ్చును. విద్యా కృషి బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లపైన, ఆరోగ్యముకై ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అనుకోని ప్రయాణాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఉద్యోగుల సమర్థతకు సరైన గుర్తింపు లభించదు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెట్టుబడులు, కొత్త వ్యాపారాలు ప్రస్తుతానికి విరమించండి. ఉద్యోగుల విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. అనుకోని ప్రయాణాలు బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. కొన్ని అనవసర ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. వ్యవహారాలు, పనుల వల్ల తీరిక ఉండదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు

ప్రభుత్వ పర్మిషన్లు, బ్యాంకులోన్లు పొందుతారు. అనవసర విషయాలలో జోక్యం చేసికొనవద్దు. పెట్టుబడులకు అనుకూలం. ఉద్యోగులకు పనిభారం పెరిగినా అధికారుల ఆదరణ బాగుంటుంది. విద్యార్థుల కృషి బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం కలదు. ఆర్థికంగా బలపడతారు. వృత్తి వ్యాపారాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు నెరవేరుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగున్నది. వివాహ, ఉద్యోగ ప్రయత్నాలలో ఇతరుల సహకారం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. పెట్టుబడులకు పొదుపు పథకాలకు ప్రయత్నాలు చేస్తారు. ఆదాయానికి లోపం రాదు.

# కల్యాణ వైభవం...!



ఇందుకూరుపేట మండలం కొరుటూరు వాస్తవ్యులు గండవరపు శ్రీనివాసులురెడ్డి - సాయికుమారిల కుమారుడు **అనీత్‌కుమార్ - రచన** (బుచ్చి మండలం పల్లప్రోలు వాస్తవ్యులు ఏనుగు పట్టాభిరామిరెడ్డి - సుజనల కుమార్తెల కల్యాణం ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది.
కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు



వైసిపి అమెరికా కన్వీనర్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి మేనకోడలు, నెల్లూరురూరల్ నారాయణరెడ్డిపేట వాస్తవ్యులు చేవూరు వెంకటకృష్ణారెడ్డి - జ్ఞానప్రసూనల కుమార్తె **అనూష - ఆనంద్‌కిషోర్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు శ్యామల రాఘవరెడ్డి - రమాదేవిల కుమారుడు)ల పరిణయం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



దక్షిణ మధ్య రైల్వే టిటిఇ కూరపాటి వెంకటవిజయభాస్కర్‌రెడ్డి - కవితల కుమార్తె **సుష్మ - శ్రీధర్‌రెడ్డి** (దుత్తలూరు మండలం, లక్ష్మీపురం వాస్తవ్యులు కండ్లగుంట రవీంద్రరెడ్డి - రాజేశ్వరిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 1వ తేదీ నెల్లూరులో ఎంసిఎస్ కళ్యాణ మండపం నందు జరిగింది.
నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు కర్ణాలవీధి వాస్తవ్యులు బొగ్గవరపు మస్తానయ్య - లక్ష్మిల కుమార్తె **నాగ వైష్ణవి - గురు వెంకట సాయికృష్ణ తేజ** (హైదరాబాద్ వాస్తవ్యులు నిచ్చెనమెట్ల గురుమోహన్ - దేవిల కుమారుడు)ల వివాహం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



ఈ నెల 19వ తేదీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వేమిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కడివేటి రామమూర్తి పక్కన 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి

# బాబు పాలనలో సంక్షోభంలో సంక్షేమం


## - నగర ఎమ్మెల్యే అనిల్



చంద్రబాబు పాలనలో ప్రజల సంక్షేమం సంక్షోభంలో పడిందని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆరోపించారు. ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నెల 18న 10వ డివిజన్ పరిధిలోని రామచంద్రాపురంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు తమకు రేషన్‌కార్డులు అందలేదని ఎమ్మెల్యేకి చెప్పుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిప్రాంతంలో ఈ సమస్య వుందని, నాలుగైదుసార్లు దరఖాస్తు చేసుకున్నా కూడా రేషన్‌కార్డులను మంజూరు చేయడం లేదని, గత రెండేళ్ళుగా వేలకొద్ది రేషన్‌కార్డులు పెండింగ్‌లో వున్నాయని పేర్కొన్నారు. నగరంలో 60ఏళ్లు దాటిన వృద్ధులు దాదాపు 1900 మంది వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం దగ్గరపడిందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శేషుగౌడ్, సిహెచ్ వెంకట్రావ్, పత్తి చంద్రశేఖర్, రాజానాయుడు, ఎం.వెంకటరమణ, కొండారెడ్డి, గిరి, వినీల్, కర్తం ప్రతాప్‌రెడ్డి, గోతం బాలకృష్ణ, ఈదల ధనుజ, మునెమ్మ, దామవరపు చంద్రమోహన్, గంగాధర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# "శివారెడ్డితో కాసేపు"



ప్రముఖకవి, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ 'కె.శివారెడ్డితో కాసేపు' కార్యక్రమాన్ని ఈ నెల 29వ తేదీ ఉదయం 9.30గంటలకు నెల్లూరు ఆచారివీధిలోని హోటల్ శివమ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్ని నారాయణరావు, డాక్టర్ ఈదూరు సుధాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ కవిత్వానికి చిరునామా అయిన శివారెడ్డి, సాహిత్యంపై కీలకోపన్యాసం చేస్తారని, ప్రముఖ కవి శ్రీరామకవచం సాగర్ వ్రాసిన 'యాతన' నవలను ఆవిష్కరిస్తారని తెలిపారు. 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కవిసమ్మేళనం కూడా ఉంటుందని వారు పేర్కొన్నారు.

# 'ఆనం' సరే.. మరి ఆదాల...?

(3వ పేజీ తరువాయి)

ప్రభాకర్‌రెడ్డికి వుంది. ముఖ్యంగా వై.యస్. గురించి గాని, జగన్ గురించి గాని ఆయన ఎక్కడా తీవ్రస్థాయి విమర్శలు చేయలేదు. తన పని తాను చేసుకుపోతాడు తప్ప వివాదాల జోలికి వెళ్ళడు. ఒక పర్యాయం మంత్రిగా, మూడు పర్యాయాలు, ఎమ్మెల్యేగా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. ఆయన ఏ పార్టీలో చేరినా తన ప్రభావాన్ని ప్రభంజనంలా చూపించగలడన్న ధీమా అందరిలోనూ ఉంది. తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఆయన ప్రస్తుతం వున్నప్పటికీ తెలుగుదేశంలో కొనసాగడం ఆయన అనుచరులకే కష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి రాజకీయ అనుభవంతో పాటు అనుచరగణం కూడా ఎక్కువే. ఆయనకంటూ ఓ వర్గాన్ని ఆయనదంటూ బృందాన్ని ఎప్పుడూ దగ్గర పెట్టుకుని వుంటాడు. కుళ్ళు, కుట్ర కుతంత్రం అంటే ఆయనకు తెలియదు. తాను గెలవడం తన పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే ధ్యేయంగా పని చేస్తాడు. ఎప్పుడు పార్టీ పక్షపాతిగానే వుంటాడు తప్ప వ్యక్తిత్వ శత్రుత్వం చూపించడు. తానెక్కడుంటే అక్కడే కమిట్‌మెంట్‌తో పనిచేస్తాడనే పేరుంది. ఇప్పుడు ఆదాల పేరు కూడా వైసిపి శ్రేణుల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన ఏ సీటులో పోటీ చేసినా గెలుపు గ్యారంటీ అనే పేరుంది. ఆనంతో పాటు ఆదాల కూడా వచ్చేస్తే ఇక జిల్లాలో వైసిపికి తిరుగుండదన్నది వారి అభిప్రాయం.

జిల్లాకు చెందిన నాయకులు ఇప్పటికే ఆదాలతో మంతనాలు ప్రారంభించినట్లు సమాచారం. ఏది ఏమైనా జగన్ పాదయాత్ర ముగిసేవరకూ ఈ అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17వ తేదిన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై.యస్.అవినాష్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, వి.వరప్రసాద్. రాష్ట్రపతిని కలిసిన 5మంది ఎంపీలలో ముగ్గురు నెల్లూరీయులు కావడం గమనార్హం.

# నీ రాక కోసం.. నిలువెల్ల కనులై...

(మొదటి పేజీ తరువాయి)

పోయిందంటున్నారు. ఇదయ్యా నెల్లూరులో టాక్! చీరల కొట్లోళ్ళు, నగల షాపులోళ్ళు, హోటల్ వాళ్ళు, ఆఖరకు బార్బర్‌షాపుల వాళ్ళు కూడా నువ్వు నెల్లూరుకు ఎప్పుడొస్తావా, తమ షాపులలో ఎప్పుడు అడుగు పెడతావా అని ఎదురుచూస్తున్నారయ్యా... ఏం సుబ్బక్కా... ఏం మాధవా... ఒరే నాగా... అంటూ ఎంతో ఆత్మీయంగా వుండే ఈ పిలుపులు విని ఎన్నిరోజులైందయ్యా... నువ్వు సిగరెట్ మడుస్తుంటే, గాలిలోకి పొగ వదుల్తుంటే ఆ తీరే వేరు కదయ్యా. ఒక్క నెల్లూరు జనానికే కాదయ్యో నువ్వంటే ప్రేమ... నెల్లూరు దేవుళ్ళు కూడా నీ ఫ్యాన్సే! పోయిన ముక్కోటికి లేక పోతివి, మొన్న రంగనాథస్వామి తిరునాళ్ళకు లేకపోతివి. ముక్కోటినాడు నువ్వు దేవుడి పల్లకీ మోస్తుంటే, చూడడానికి ఎంత అందంగా ఉండేదో... ఆ స్వామికి కూడా నువ్వు పల్లకీ మోయని కొరత కనిపిస్తున్నట్లుంది. రంగని తేరు ముందు నువ్వు కనిపించకుంటే ఎంత లోటనిపిస్తుందో... ఒక్క రంగడే కాదు, మూలాపేట శివుడు, వేణుగోపాలుడు, దర్గామిట్ట రాజేశ్వరమ్మ, గ్రామదేవత ఇరుకళలమ్మ... వీళ్ళందరూ కూడా మా బిడ్డ మామీదే మన్నా అలిగిపోయాడా అని నీ కోసం ఎదురుచూస్తున్నారయ్యా... దర్గా దగ్గర రొట్టెల పండుగ జరుగుతుంటే... నువ్వు అక్కడ లేనిలోటు చాలా ఉందయ్యా... దేశవిదేశాల నుండి వచ్చినవాళ్ళు కూడా ఇక్కడ ఒక ఫకీర్ బాబా వుండాలే అని నీ కోసం వెదుకుతున్నారయ్యా... రొట్టెల పండుగలో నువ్వు చేసే సందడి అంతా ఇంతా కాదు కదా... ముస్లింలకు తగ్గట్లుగా నువ్వు వేసే గెటప్ ముందు అరబ్ షేక్‌లు కూడా పనికిరారుగా! గుడ్‌ఫ్రైడే నాడు నువ్వు శిలువ మోస్తుంటే, ఆ ఏసు ప్రభువే దిగివచ్చినట్లుగా అనిపించేదికదయ్యా! ఆ ప్రభువు తన శిలువను నువ్వు మోయడం లేదని ఎంత బాధపడుతున్నాడో!

గంభీరమైన నీ గొంతు వినపడక, నిండు చంద్రుడిలా వెలిగే నీ ముఖం కనపడక నెల్లూరీయులందరూ ఏదో పోగొట్టుకున్నామనే దిగులుతో వున్నారు. మనోళ్ళకు నిన్ను చూస్తే ఆనందం... నీ మాటలు వింటుంటే పరమానందం... నీ హావభావాలు చూస్తుంటే బ్రహ్మానందం. వొళ్ళు బాగలేక హైదరాబాద్‌లో వున్నావని తెలిసింది... నువ్వు కొలిచే దేవుళ్ళే నిన్ను చల్లగా చూస్తారు. త్వరగా కోలుకుని నల్ల ఫ్యాంటు, నల్ల చొక్కా, నల్ల బూట్లు వేసుకుని, నల్లకళ్ళద్దాలు పెట్టి, నల్లకారులో నీ నెల్లూరీయుల కోసం దిగవయ్యా...

రాజకీయాలు వేరు, వ్యక్తిత్వం వేరు, పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు వదిలేస్తే అందరూ మనుషులే, అందరిదీ మానవజన్మే. రాజకీయంగా నువ్వెవరైనా కావచ్చు, వ్యక్తిగా నాకు నువ్వంటే ఇష్టం, నీ నవ్వంటే ఇష్టం, నీ నడకంటే ఇష్టం, నీ మాటంటే ఇష్టం, నీ స్టైలంటే ఇష్టం... అందుకేనయ్యా వివేకయ్యా నీ రాక కోసం నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్నాను.

ఇట్లు

నీ... నెల్లూరు.

# ట్రెండ్ మారింది

(మొదటి పేజీ తరువాయి)

నడుస్తోంది. రెండు నెలల క్రితం దాకా కూడా రాష్ట్ర రాజకీయలలో ఒక విధమైన వాతావరణం వుండింది. 2019 ఎన్నికల్లోనూ తిరిగి తెలుగుదేశమే అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు అనుభవజ్ఞుడని, ఆయన తిమ్మిని బమ్మిని చేసైనా పార్టీని గెలిపించుకోగలడని నమ్ముతూ వచ్చారు. ముఖ్యంగా జగన్ ఎంత అరచి గీపెట్టుకున్నా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తప్పితే గుంటూరు నుండి శ్రీకాకుళం దాకా వైసిపికి పెద్దగా సీట్లు రావని, చంద్రబాబే మళ్ళీ సీఎం అంటూ విశ్వసించారు. దీనికితోడు చంద్రబాబు అనుకూల మీడియా కూడా ఆయనకే బాకా ఊదసాగింది.


కాని రాష్ట్ర రాజకీయాలలో కేవలం రెండు నెలల కాలంలోనే పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. జగన్ తీసుకున్న స్థిరమైన నిర్ణయాలు ప్రజల్లో వైకాపా ఇమేజ్‌ను పెంచగా, చంద్రబాబు 'యూ టర్న్' రాజకీయాలు ఆయన పార్టీకి పెద్ద డామేజీ అయ్యాయి. ఏపికి ఎంతో ప్రయోజనం చేకూర్చే ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు వైఖరి ప్రజలకు నచ్చలేదు. ముఖ్యంగా యువత విశ్వాసాన్ని ఆయన కోల్పోయాడు. ఓటర్ల జాబితా నుండి వృద్ధులు తొలుగుతుంటారు, యువత కొత్తగా చేరుతుంటుంది. ప్రత్యేక హోదా ఉద్యమం యువత కోసమే. కాబట్టే వాళ్ళు జగన్ పట్ల అభిమానం చూపుతున్నారు. హోదా ఉద్యమంలో జగన్ దూకుడు ప్రజల ఆమోదం పొందింది. ప్రత్యేకహోదాను మొదట వ్యతిరేకించి తర్వాత హోదానే కావాలన్న చంద్రబాబు డ్రామాలను ప్రజలు అంగీకరించడం లేదు.

దీనికితోడు ఎన్డీఏ నుండి బయటకొచ్చాక టీడీపీ ప్రభుత్వ అవినీతిపై విమర్శలు పెరిగాయి. చంద్రబాబు అవినీతిని లెక్కలతో సహా వివరిస్తామని బీజేపీ నాయకులు పేపర్లు పట్టుకుని తిరుగుతున్నారు. మరోవక్క జనసేన పవన్‌కళ్యాణ్ చేసిన అవినీతి ఆరోపణలు కూడా తెలుగుదేశంను అతలాకుతలం చేసాయి. ఇక నాలుగేళ్ళ చంద్రబాబు పాలనలో అన్నీ వైఫల్యాలే. ఒక్క విజయమూ లేదు. చెప్పుకోదగ్గ పని ఒక్కటీ లేదు.

చంద్రబాబుపై నమ్మకం సడలిపోయింది. అదే సమయంలో జగన్‌పై ప్రజలలో నమ్మకం పెరుగుతోంది. ప్రత్యేకహోదా ఉద్యమంలో ఒకే మాట, ఒకే బాట అంటూ నాలుగేళ్ళుగా జగన్ సాగించిన పోరాటం ఆయనకు మైలేజీని పెంచింది. ఇక ప్రజా సంకల్పయాత్ర అంటూ ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం దాకా ఆయన మొదలుపెట్టిన పాదయాత్ర జైత్రయాత్రలాగా సాగుతోంది. వైసిపికి పట్టున్న కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనే కాదు, టీడీపీ కంచుకోటలు గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ జగన్ పాదయాత్ర ప్రభంజనంలా మారింది. రాష్ట్రంలో రాజకీయ విశ్లేషణలు సైతం మారిపోయాయి. కొద్ది నెలల క్రితంవరకు మళ్ళీ తెలుగుదేశందే అధికారం అంటున్న గొంతులు కూడా ఇప్పుడు పెగలడం లేదు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశానికి ఓటేసిన ప్రతి పదిమందిలో ఐదుమంది ఆ పార్టీ పనితీరుపై అసంతృప్తితో వున్నారు. కాని, అదే ఎన్నికల్లో వైసిపికి ఓటేసిన ప్రతి పదిమందిలో తొమ్మిదిమంది వైసిపితోనే వున్నారు.

కరెక్ట్‌గా ఇంకో ఏడాదిలో ఎన్నికలు... ఎలక్షన్ ట్రెండ్ మొదలైనట్లే! ఇక్కడనుండే ఎత్తులు, పైఎత్తులు మొదలవుతాయి. ఇప్పటికైతే రాష్ట్రంలో వైసిపికి అనుకూల వాతావరణముంది. చంద్రబాబు సరిదిద్దుకోలేనంత వ్యతిరేకత తెచ్చుకున్నాడు. శత్రువు బలహీనతనే జగన్ తన బలంగా మలచుకుంటే ఇదే ట్రెండ్ ఎలక్షన్‌లలో ఉపయోగపడుతుంది.


# సంస్మరణ



కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు

నిర్యాణం: 23-4-1995 వర్ధంతి: 23-4-2018

మా తండ్రి

బోగొల్లు నారాయణరెడ్డి గారి

23వ వర్ధంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ...

బి.మోహన్‌రెడ్డి

Architect & Engineer

Mohan Architects (P) Ltd.,

Chennai

ఫోన్: 044-24510157

మరియు

కుటుంబసభ్యులు

# శ్రద్ధాంజలి



## శ్రీ మేడా అశోక్‌కుమార్‌రెడ్డి

జననం
20.12.1958

మరణం
08.04.2018

### మిత్రమా అశోక్...

తియ్యని మాటలతో, కమ్మని స్నేహంతో
ఎన్నో అనుభూతులను అందించావు
మధుర జ్ఞాపకాలను మిగిల్చావు.

నువ్విక లేవన్న నిజం నమ్మలేకున్నాను.
నువ్విక రావన్న మాటే తట్టుకోలేకున్నాను.

మధురమైన స్నేహం మనది...
మరపురాని బంధం మనది.

నీ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

నీ...

**దువ్వూరు శివకుమార్‌రెడ్డి**
నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com